
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 255 ISSUE NO : 255 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం, ఏప్రిల్, 7, 2026 Tuesday, April, 7, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## ఇజ్రాయిల్ దాడుల్లో..

# 25 మంది మృతి

### ఇంతకంటే తీవ్రంగా ప్రతీకారం తీర్చుకుంటాం: ఇరాన్

టెహ్రాన్ : సోమవారం తెల్లవారుజామున టెహ్రాన్‌లోని షరీఫ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ వైమానిక దాడులకు పాల్పండింది. ఈ దాడుల్లో 25 మంది మృతి చెందారు. టెహ్రాన్‌లోని ప్రభుత్వ పాలనా లక్ష్యాలను టార్గెట్‌గా చేసుకుని దాడి చేశామని ఈ దాడుల్లో 25 మంది మృతి చెందారని ఇజ్రాయిల్ సైన్యం సోమవారం ప్రకటించింది. హర్మోజ్ జలసంధిని 48 గంట్లో తెరవాలని లేకపోతే నరకం చూపిస్తామని అమెరికా ఇరాన్‌ని హెచ్చరించిన తర్వాత ఇజ్రాయిల్ అత్యంత దారుణంగా దాడులకు పాల్పడింది.




## యూసీసీ, వన్ నేషన్-వన్ ఎలక్షన్‌పై

# అందరూ చర్చిస్తున్నారు

## ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఉమ్మడి పౌరస్మృతి, వన్ నేషన్, వన్ ఎలక్షన్ గురించి తమ ప్రభుత్వం పాజిటివ్ కోణం లో ఆలోచిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. తమ పార్టీ అమలు చేయాల్సిన ఎజెండాల్లో ఆ రెండూ మిగిలి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే వీటి గురించి దేశ ప్రజలు సీరియస్‌గా ఆలోచి స్తున్నారన్నారు. బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వర్చువల్‌గా కార్యకర్తలను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో బీజేపీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ పార్టీ వారిని టార్గెట్ చేసిందన్నారు. బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో అనేక బీజేపీ మంది కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. ఆ రాష్ట్రాల్లో హింస అనేది రాజకీయ సంస్కృతిగా మారిందన్నారు. తమ మిషన్ ఇంకా కొనసాగుతోందని, ఉమ్మడి పౌరస్మృతితో పాటు వన్ నేషన్, వన్ ఎలక్షన్ గురించి దేశంలో తీవ్ర చర్చ జరుగుతోందని, పాజిటివ్ కోణంలో ముందుకు వెళ్తున్నామన్నారు. వన్ నేషనల్ వన్ ఎలక్షన్ కింద లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహిస్తారు.



# నేడు డెడ్‌లైన్..

### ఒప్పందం చేసుకోకుంటే ఇరాన్‌ను పేల్చేస్తామన్న ట్రంప్

వాషింగ్టన్: అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఇరా న్‌తో ఒప్పందం కుదరకపోతే అక్కడున్న ప్రతీదాన్నీ పేల్చేస్తానంటూ అమెరి కా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక జారీ చేశారు. కాల్పుల విరమణ, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం లక్ష్యంగా పాకిస్థాన్, ఈజిప్ట్, టర్కీ మధ్యవర్తిత్వంతో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గల్ఫ్ ప్రాంతంలో కలకలం రేపింది. మంగళవారం నాటికి ఒప్పందం జరగకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని ఆయన అల్టిమేటం ఇచ్చారు. "మంగళవారం ఇరాన్‌లో పవర్ ప్లాంట్లు, బ్రిడ్జిల దినోత్సవం అవుతుంది.







## బీజేపీ కేవలం ఒక రాజకీయ పార్టీ కాదు..

### 140 కోట్ల మంది ఆకాంక్షల

# ప్రతినిధి

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ఢిల్లీ,: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్టీ కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, బీజేపీ ప్రస్థానం, ఆశయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'రాష్ట్రహితమే సర్వోపరి' (దేశప్రయోజనాలే అత్యున్నతం) అనే సంకల్పంతో పని చేస్తున్న ప్రతి కార్యకర్తకు ఈ అభినం దనలు వర్తిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా ప్రత్యేకమైన ట్వీట్ చేసిన అమిత్ షా.. "డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయల (జాతీయవాద) ఆలోచనలు, వైజ్ఞానికప్రేరణతో ఏర్పడిన బీజేపీ ఆవిర్భావం కేవలం ఒక రాజకీయ ఘటన మాత్రమే కాదని, అది దేశ పునర్నిర్మాణం కోసం తీసుకున్న ఒక గొప్ప సంకల్పమని అమిత్ షా కొనియాడారు.

## ఆదిలాబాద్‌కు గోదావరి నీరు

# పారిస్తాం

- తుమ్మిడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన

ఆదిలాబాద్,తెలంగాణ దిశ : గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు

# బాసర జ్ఞానసరస్వతి ఆలయ విస్తరణ

### *225 కోట్లతో అధునాతనంగా పునర్నిర్మాణం*
### *ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహణ*
### *మనవడికి అక్షరాభ్యాసం చేయించిన సిఎం*

నిర్మల్, ఏప్రిల్6 ,తెలంగాణ దిశ : నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాల యాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేసిన అనంత రం.. మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. తర్వాత ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. రూ.225 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బాసరలోని జ్ఞాన సర స్వతి దేవాలయాన్ని పునరభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపాం దించారు. ఈ ప్లాన్‌లో ఆలయ రీడెవలప్‌మెంట్ నమూనాలోని ఒక భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది.





## అమెరికా రెస్క్యూ ఆపరేషన్

# సాహసోపేతం

### ట్రంప్‌కు నెతన్యాహు ప్రశంసలు

న్యూఢిల్లీ,ఏప్రిల్6 : పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ, అమెరికా చేపట్టిన సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్‌పై అంతర్జాతీయంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదంలో చిక్కుకున్న అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధ విమాన సిబ్బందిని సురక్షితంగా కాపాడిన తీరును ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు కొనియాడారు. ఇరాన్ సరిహద్దుల సమీపంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో, సాంకేతిక కారణాల వల్ల లేదా శత్రు దాడుల వల్ల అమెరికాకు చెందిన ఒక ఎఫ్-15 యుద్ధ విమానం ప్రమాదానికి గురైంది. అయితే, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో అమెరికా సైన్యం మెరుపు వేగంతో స్పందించి, ఇరాన్ గగనతలాన శోధించి ఆ విమానంలోని సిబ్బందిని ప్రాణాలతో కాపాడిన సంగతి తెలిసిందే. ఈవిజయంపై నెతన్యాహు స్పందిస్తూ.. ఇది అమెరికా సైనిక సామర్థ్యా నికి, అధ్యక్షుడు ట్రంప్ దృఢ నిశ్చయానికి నిదర్శనమని పేర్కొన్నారు. 'అమెరికన్ మిషన్ అత్యంత కచ్చితత్వంతో జరిగింది.



## ట్రంప్‌కు జ్ఞానోదయం

# అయ్యేనా ?

ఢిల్లీ,: పిల్లికి చెలగాటం..ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఇప్పుడు అమెరికా, ఇరాన్‌ల యుద్ధం తయారయ్యింది. ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..ఇరాన్ కోలుకోలేకుండా చేయడవే లక్ష్యంగా ట్రంప్ మూర్ఖంగా ముందుకు సాగుతున్నారు. ట్రంపం ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు. ఇంటాబయటా నిరసనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇకముందు ప్రపంచంలో ఇంధన కొరత తీవ్ర రూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తుంది. ఇంధన కొరత అన్ని దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీనిగురించి ట్రంప్‌కు పెద్దగా బెంగ లేదు. ప్రజలు ఏమయితే ఏమిటన్న ధోరణిలో ఆయన యుద్ధాన్ని ప్రేరేపించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఏమి జరిగినా అది మన ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవాలా వద్దా అన్నంత ప్రభావం చూపుతోంది. ఇప్పటికే మనదేశంలో హోటల్ పరిశ్రమ కుదేలయ్యింది. ఇలాగే యుద్ధం కొనసాగితే దాని ప్రభావం ఎన్నాళ్ళ ఉంటుందో చెప్పలేం.ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టి ఇరాన్÷-ను దెబ్బతీసినందుకు గాను ఇరాన్ కూడా గట్టిగానే ఎదురిస్తోంది. అంతు చూస్తామని అమెరికాను హెచ్చరి స్తోంది. తమకు నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా మీద ఇరాన్ చేసిన దాడిని తక్కువగా అంచనా వేయటం తగదని అమెరికా పూర్వ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌కు హితవు పలుకుతున్నాడంటే ఇక పైనైనా ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పడమే!



## కాంగ్రెస్ కు దూరమౌతున్న..

# సీనియర్లు?

హైదరాబాద్,తెలంగాణ దిశ :సీనియర్లు, సీనియర్ లీడర్ల వారసులు. వాళ్లంతా కాం గ్రెస్ పార్టీకి లాయలిస్ట్‌లు. కానీ ఒక్కక్కొరుగా హస్తం పార్టీకి గుడ్ బై చెప్తున్నారు. పార్టీని నమ్ముకుని ఉంటే నట్టేట ముంచుతు న్నారని మండిప డుతూ..ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధాన్ని తెంచుకు ంటున్నారు. లేటెస్ట్‌గా దివంగత నేత డీఎస్ తనయుడు సంజయ్ కూడా కాంగ్రెస్ గూటి నుంచి బయటికి వచ్చేందుకు రెడీ అయ్యారు. ఈ మధ్యే సీనియర్ మోస్ట్ కాంగ్రెస్ లీడర్ జీవన్ రెడ్డి కూడా హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఎక్కడైనా ప్రతిపక్షాల నుంచి అధికార పార్టీలోకి జంపింగ్స్ ఉంటా య్. లేటెస్ట్‌గా తెలంగాణలో డిఫరెంట్ సీన్ కనిపిస్తోంది. కాంగ్రెస్ అంటే ఆ నేతలు..ఆ నేతల పేరు ఎత్తితే కాంగ్రెస్ గుర్తుకు వచ్చే లీడర్లు.. హస్తం పార్టీకి హ్యాండ్ ఇస్తున్నారు. ఇప్పటికే జగిత్యాలకు చెందిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీని వీడారు. నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న ఆయన పార్టీ కష్టకాలంలో అండగా నిలిచారు. అలాంటి నేత కాంగ్రెస్‌ను వీడటం చర్చనీయాంశంగా మారింది.తనకు అన్యాయం జరిగిందని, గుర్తింపు ఇవ్వలేదన్న ఆవేదనతో.. సొంత పార్టీ అధిష్టానం, రాష్ట్ర పెద్దల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పారు జీవన్‌రెడ్డి.

# ఘనంగా మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి జన్మదిన వేడుకలు



**మేడ్చల్, ఏప్రిల్ 06, (తెలంగాణ దిశ) :**బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మేడ్చల్ జిల్లా కండ్లకోయలోని నిమ్మల కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా మేడ్చల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి తమ కార్యవర్గ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి హరివర్ధన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకత్వం, సేవాభావం ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్న ఆయనకు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాచురల్ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అనంత లక్ష్మి, మేడ్చల్ మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి దుర్గా, ప్రధాన కార్యదర్శులు మెరుగు సునీత, జాజాల రమ్య, కూకట్ పల్లి నియోజకవర్గం బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, డివిజన్ అధ్యక్షురాలు రజిత, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షురాలు ఈ శ్వేత, చింతా విజయ, సునీత, పరమేశ్వరి గౌడ్, దమ్మాయిగూడ మున్సిపల్ ప్రెసిడెంట్ జూపల్లి శోభారాణి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్ఎంసి మహిళా ప్రెసిడెంట్ ఇందిరా, డివిజన్ అధ్యక్షురాలు తులసి, సుజాత యాదవ్, సుజాత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగి, నాయకులు హరివర్ధన్ రెడ్డి దీర్ఘాయుష్షుతో పాటు మరింత ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు.



## లావణ్య పట్టా భూమిలో నిర్మాణ పనులను ఆపాలి



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 06, (తెలంగాణ దిశ) :**బాచుపల్లి మండలం నిజాంపేట గ్రామం 233/22, 24, 25, 26 లావణ్య పట్టా భూములలో నిర్మాణ పనులను తక్షణమే నిలిపి వేసే విధంగా తీసుకోవాలని శ్రీమేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ కు సోమవారం నిజాంపేట్ కు చెందిన ఆకుల సతీష్ ఫిర్యాదు చేశారు. కోర్టు ఉత్తర్వుల పేరుతో ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించాలని చూస్తున్నారని ఆయన అదనపు కలెక్టర్ కు వివరించారు. అలాగే ప్రగతి నగర్ సర్వే నెంబర్ 182 ప్లాట్ నెంబర్ తో 186 లో 15 గుంటల ప్రభుత్వ భూమి ఆక్రమణపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించాలని ఆయన మనవి చేశారు. నిజాంపేట్ లో ఎస్ ఎన్ డి పి 9 పనులలో మూడు పూర్తి చేయకుండానే 84 కోట్ల రూపాయలు సదరు కాంట్రాక్టర్ కు అధికారులు బిల్లులు చెల్లించారని ఈ విషయమై విజిలెన్స్ విచారణ జరిపించి అందుకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్ ఎన్ డి పి పనులు చేయకుండానే పైసలు మంజూరు చేయించిన వారిలో పలువురు ప్రముఖులు ఉన్నారని, ఆ ప్రముఖుల సన్నిహితుడైన కాంట్రాక్టర్ సుధాకర్ పై యాంటీ కరప్షన్, విజిలెన్స్ కేసులను నమోదు చేయాలని ఆయన సూచించారు.


# సోషల్ మీడియాకు బానిసవుతున్న యువత..



## మెటా, యూట్యూబ్‌కు భారీ జరిమానా

లాస్ ఏంజిల్స్: సోషల్ మీడియాకు యువత బానిసలు అవుతున్నట్లు నమోదు అయిన కేసులో.. మెటా, యూట్యూబ్ సంస్థలకు అమెరికా కోర్టు భారీ జరిమానా వేసింది. చిన్నతనం నుంచి సోషల్ మీడియాకు బానిసైనట్లు ఓ మహిళ దాఖలు చేసిన కేసులో లాస్ ఏంజిల్స్ జ్యూరీ అసాధారణ తీర్పును వెలువరించింది. ఆ అమ్మాయికి రెండు కంపెనీలు కలిసి సుమారు 6 మిలియన్ల డాలర్ల నష్టపరిహారాన్ని చెల్లించాలని జ్యూరీ తన ఆదేశాల్లో పేర్కొన్నది. సోషల్ మీడియా కాంటెంట్ సిగరెట్ల తరహాలో యువతను బానిసలుగా మారుస్తున్నట్లు జ్యూరీ ఆరోపించింది. పిల్లలు, యువకులు సోషల్ మీడియా తప్ప మరో ప్రపంచాన్ని గ్రహించలేకపోతున్నట్లు జ్యూరీ చెప్పింది. సోషల్ మీడియా వల్ల వ్యక్తిగతంగా మనుషులు నష్టపోతున్నారని పేర్కొన్నది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ కంపెనీ యజమానులు.. పిల్లల సంరక్షణ మరిచి తమ సోషల్‌మీడియా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు జ్యూరీ వెల్లడించింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ ప్రస్తుతం మెటా పరిధిలో ఉన్నాయి, ఇక యూట్యూబ్ మాత్రం గూగుల్ ఆధీనంలో ఉన్నది. అయితే ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు అన్నీ యువతను ఆకర్షించే రీతిలో తమ ప్రోగ్రామింగ్‌ను తయారు చేసుకున్నట్లు జ్యూరీ పేర్కొన్నది. అడిక్షన్ కేసులో 20 ఏళ్ల అమ్మాయి మానసిక ఆరోగ్యాన్ని సోషల్ మీడియా దెబ్బతీసినట్లు జ్యూరీ వెల్లడించింది. కాలే అనే అమ్మాయికి 6 మిలియన్ల డాలర్లు చెల్లించాలని జ్యూరీ సభ్యులు ఆదేశించారు. అయితే ఇలాంటి మీడియా అడిక్షన్ కేసులు ప్రస్తుతం అమెరికా కోర్టుల్లో కొన్నివందల సంఖ్యల్లో ఉన్నాయి. తాజా తీర్పుతో ఆ కేసులకు ఊతం ఇచ్చినట్లు అవుతుందని నిపుణులు అంటున్నారు. జ్యూరీ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు మెటా, గూగల్ సంస్థలు పేర్కొన్నాయి. టీనేజీ యువత మానసిక ఆరోగ్యం చాలా సంక్లిష్టంగా ఉంటుందని, ఒకే ఒక్క యాప్‌తో అవన్నీ లింకు పెట్టడం సరికాదు అని ఆ సంస్థలు వాదించాయి. గూగుల్ ప్రతినిధి మాట్లాడుతూ యూట్యూబ్ గురించి తప్పుగా అర్థం చేసుకున్నారని, యూట్యూబ్ అనేది స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అని, అదేమీ సోషల్ మీడియా సైట్ కాదు అని పేర్కొన్నారు. కాలే అమ్మాయి కేసులో మెటా సంస్థ 70 శాతం, గూగల్ సంస్థ 30 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

# అందుబాటులోకి రానున్న నేషనల్ హైవే 565





**ఒంగోలు,తెలంగాణ దిశ :**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కీలకమైన నేషనల్ హైవే 565 పనులు పూర్తి చేశారు. ఈ హైవేపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ హైవే పనుల్లో భాగంగా.. యర్రగొండ పాలెం దగ్గర 20 కిలో మీటర్ల రోడ్డును విస్తరించారు. దీంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఊరట దక్కింది. ఈ 20 కిలో మీటర్లు అటవీ ప్రాంతం మీదుగా వెళుతోంది.. బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లతో ప్రయాణం సాఫీగా సాగుతోంది.తెలుగు రాష్ట్రాల మధ్య నేషనల్ హైవే 565 అందుబాటులోకి వచ్చింది. తెలంగాణలోని నకిరేకల్ వద్ద మొదలయ్యే ఈ హైవే.. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి సమీపంలో ఉన్నఏర్పేడు దగ్గర ముగుస్తుంది. ఈ కొత్త హైవే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 65ని.. మదనపల్లె నుంచి నాయుడుపేట వెళ్లే నేషనల్ హైవే 71తో కలుపుతుంది. తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి తిరుపతి వెళ్లడానికి ఈ కొత్త హైవే ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడనుంది.ఈ హైవే నల్గొండ, మాచర్ల, యర్రగొండపాలెం, మార్కాపురం, పొదిలి, కనిగిరి, పామూరు, దుత్తలూరు, రాపూరు, వెంకటగిరి, ఏర్పేడు మీదుగా వెళుతోంది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్ రాత్రిళ్లు అటవీ ప్రాంతం మీదుగా వెళ్లడం గతంలో చాలా ఇబ్బందిగా ఉండేది. ముఖ్యంగా పుల్లల చెరువు దగ్గర నుంచి వెల్దుర్తి మండలం వరకు రోడ్డు పరిస్థితి దారుణంగా ఉండేది. ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. అయితే జాతీయ రహదారి 565 నిర్మాణంతో ఆ కష్టాలు తొలగిపోయాయి. ఈ రోడ్డు అభివృద్ధి చేయడంతో యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం సులభతరమైంది.ఈ రూట్‌లో.. ఎన్‌హెచ్-565లో భాగంగా ఉన్న ఈ 20 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు గతంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా అటవీ అనుమతులు ఆలస్యం కావడంతోపాటు మరికొన్ని అడ్డంకులు వచ్చాయి. అయితే 2024లో ఈ పనులకు లైన్ క్లియర్ కావడంతో.. గతేడాది పనులు ప్రారంభించి వేగవంతం చేశారు. ఈ రోడ్డును నిర్దేశిత సమయం కంటే ముందే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. అటవీ ప్రాంతం మీదుగా కొండలు, లోయల మధ్య వెళ్లే ప్రయాణికులకు ఈ మార్గం సరికొత్త అనుభూతిని పంచుతోంది. రోడ్డు బాగోలేకపోవడంతో పుల్లలచెరువు నుంచి వెల్దుర్తి మండలం వరకు ప్రయాణానికి 50 నిమిషాలు పట్టేది. కానీ ఇప్పుడు 20 నిమిషాల్లోనే వెళ్లొచ్చు. 20 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు నిర్మాణానికి రూ.393 కోట్లు ఖర్చు చేశారు. అటవీ ప్రాంతం, ఘాట్ రోడ్డు కావంతో చిన్న, పెద్దవి కలిపి మొత్తం 16 వంతెనలు, 8 అండర్‌పాస్‌లను ఏర్పాటు చేశారు.మార్కాపురం జిల్లాతో కడప జిల్లాలోని పోరుమామిళ్ల ప్రాంతం నుంచి ఈ రోడ్డు మీదుగానే హైదరాబాద్ వెళ్లొచ్చు. ఈ హైవే మొత్తం పొడవు దాదాపు 420 కిలోమీటర్లు కాగా.. మెజార్టీ భాగం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. తెలంగాణలోని నకిరేకల్, నల్గొండ, కనగల్, దేవరకొండ ప్రాంతాలను దాటిన తర్వాత మాచర్ల వద్ద ఈ హైవే ఏపీలోకి ఎంటర్ అవుతుంది. ఏర్పేడు వద్ద ఎడమ వైపు ప్రయాణిస్తే శ్రీకాళహస్తి, కుడి వైపు తిరిగే తిరుపతి వెళ్లొచ్చు.

# కవచ్ టెక్నాలజీతో ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ

చెన్నై: భారతదేశ గర్వకారణమైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రధానంగా చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ లో రూపుదిద్దుకుంటున్నాయి. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు, అత్యాధునిక సాంకేతికతకు నిలువుటద్దం. కేవలం చెన్నైలోనే కాకుండా, పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రాయ్‌బరేలీలోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీ, లాతూర్, సోనిపట్‌లలో కూడా వీటి తయారీకి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. కేవలం 52సెకన్లలోనే 100కిలోమీటర్ల వేగాన్నిఅందుకోగల సామర్థ్యం ఈ రైళ్ల సొంతం. ప్రయాణికుల భద్రత కోసం 'కవచ్' టెక్నాలజీ, సౌకర్యం కోసం 180డిగ్రీలు తిరిగే సీట్లువీటి ప్రత్యేకత. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ వందే భారత్ రైళ్లు భారతీయ రైల్వే విప్లవం అని చెప్పక తప్పదు. తమిళనాడులోని చెన్నైలో ఉన్న ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ వందే భారత్ రైళ్లకు జన్మస్థానం. 2018లో మొట్టమొదటి ట్రైన్ 18 (వందే భారత్) ఇక్కడే తయారైంది. అత్యుత్తమ ఇంజనీర్లు, ఆధునిక యంత్రాల సాయంతో ప్రతి కోచ్‌ను ఇక్కడ అత్యంత జాగ్రత్తగా తీర్చిదిద్దుతారు.ప్రస్తుతం వందే భారత్ రైళ్లకు దేశవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉంది. దీన్ని చేరుకోవడానికి రైల్వే శాఖ తయారీని ఇతర కేంద్రాలకు కూడా విస్తరించింది. ఉత్తరప్రదేశ్‌లోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీలో కొత్త కోచ్‌ల తయారీ జరుగుతోంది.లాతూర్ & సోనిపట్: మహారాష్ట్రలోనిలాతూర్ మరియు హర్యానాలోని సోనిపట్ రైల్వే యూనిట్లలో కూడా తయారీ పనులు వేగవంతం చేశారు.వందే భారత్ కేవలం ఒక రైలు మాత్రమే కాదు, అదొక సాంకేతిక అద్భుతం. ఇది గరిష్టంగా గంటకు 160-180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. రైళ్ల మధ్య ఢీకొనే ప్రమాదాన్ని నివారించే కవచ్ వ్యవస్థ ఇందులో ఉంది. మరింత ప్రత్యేకంగా సెల్ఫ్-ప్రొపెల్డ్ ఇంజిన్ (ఇంజిన్ విడిగా ఉండదు), ఆటోమేటిక్ తలుపులు, వై-ఫై, మరియు జీపీఎస్ ఆధారిత సమాచార వ్యవస్థ ప్రయాణికులకు లభిస్తాయి.మేక్ ఇన్ ఇండియా విజన్ కింద తయారవుతున్న ఈ రైళ్లు ప్రపంచ స్థాయి ప్రమాణాలను కలిగి ఉన్నాయి. భవిష్యత్తులో వందే భారత్ స్లీపర్ వెర్షన్లు, మెట్రో వెర్షన్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ వేగవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా భారతీయ రైల్వే అడుగులు వేస్తోంది.

# నిలిచిన బాస్మతీ రైస్ ఎక్స్‌పోర్ట్స్..

## ఓడరేవుల్లోనే 10 లక్షల టన్నుల బియ్యం




పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధపు సెగలు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భారతీయ వ్యవసాయ రంగాన్ని, ముఖ్యంగా బాస్మతీ బియ్యం ఎగుమతి పరిశ్రమను కోలుకోలేని దెబ్బ తీశాయి. ఏటా సుమారు 6 బిలియన్ డాలర్లు అంటే రూ.54వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని దేశానికి తెచ్చి పెట్టే ఈ రంగం.. ప్రస్తుతం రవాణా మార్గాల నిలిపివేత, పేమెంట్ సమస్యలు.. షిప్‌మెంట్‌ల జాప్యంతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.భారత్ ఏటా సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల బాస్మతీ బియ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తోంది. ఇందులో దాదాపు సగానికి పైగా వాటా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాలదే. సాధారణంగా రంజాన్, ఈద్ పండుగల సమయంలో ఈ దేశాలకు ఎగుమతులు భారీ స్థాయిలో ఉంటాయి. అయితే ప్రస్తుత యుద్ధ వాతావరణం వల్ల మధ్యప్రదేశ్ వంటి ప్రధాన బాస్మతీ హబ్‌లలోని రైస్ మిల్లులు వెలవెలబోతున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే ఎగుమతి సీజన్‌లో ఇప్పుడు నిశ్శబ్దం ఆవరించిందని వారు చెబుతున్నారు.యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో ముప్పు పెరగడంతో లాజిస్టిక్స్ రంగం కుదేలైంది. గతంలో ఒక కంటైనర్‌కు 2వేల 500 డాలర్లుగా ఉన్న రవాణా ఖర్చు ఇప్పుడు ఏకంగా 7వేల నుండి 9వేల డాలర్లకు చేరింది. దీనికి తోడు ఇన్సూరెన్స్ ప్రీమియాలు పెరగడం, కంటైనర్ల కొరత ఏర్పడటంతో ఎగుమతిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 10 లక్షల టన్నుల బాస్మతీ బియ్యం ఓడరేవుల్లో, గోడౌన్లలో మూలుగుతోంది. ప్రీమియం రకమైన '1121' బాస్మతీకి పశ్చిమాసియాలో ఉన్న డిమాండ్ యూరప్ లేదా ఆఫ్రికా దేశాల్లో ఉండదు. కాబట్టి ఈ నిల్వలను ఇతర మార్కెట్లకు మళ్లించడం కూడా సాధ్యం కావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఈ అంతరాయం వల్ల ఎగుమతిదారుల వర్కింగ్ క్యాపిటల్ పూర్తిగా నిలిచిపోయింది. మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం సుమారు 2వేల కోట్ల నుండి 25వేల కోట్ల రూపాయల వరకు చెల్లింపులు నిలిచిపోయాయి. ఇది కేవలం వ్యాపారులకే కాకుండా పరోక్షంగా రైతులపై కూడా ప్రభావం చూపుతోంది. మిల్లులు కొనుగోళ్లు నిలిపివేయడంతో ధాన్యం ధరలు తగ్గే అవకాశం పెరిగింది. ఇది రైతుల ఆదాయాన్ని దెబ్బతీస్తుంది. రాబోయే సాగు సీజన్‌పై కూడా ఈ ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలుస్తోంది. భారత ప్రభుత్వం ఈ దిశగా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ, పశ్చిమాసియాలో శాంతి నెలకొంటే తప్ప భారత బాస్మతీ ఎగుమతుల ఇంజిన్ మళ్లీ గాడిన పడటం కష్టంగా కనిపిస్తోంది.

# డబ్బు కడుతున్నా డేటా మాయం

రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా ప్రస్తావించే ప్రతి అంశం సగటు భారతీయుడు ఆలోచనలకూ చాలా దెగ్గరగా ఉంటుంది. ఇప్పటి అనేక అంశాలపై రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇక తాజగా ఆయన రోజువారీ డేటా లిమిట్స్‌తో వచ్చే మొబైల్ రీచార్జ్ ప్లాన్లపై చర్చించారు. తాజాగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలా టెలికాం సంస్థలు భారీగా డేటా ఇస్తున్నాయి వంటి రోజువారీ డేటా పరిమితులను అందిస్తున్నాయి. అయితే వినియోగదారులు పూర్తిగా డేటా ఉపయోగించకపోతే, మిగిలిన డేటా అర్ధరాత్రి తర్వాత పూర్తిగా రద్దవుతోంది. ఉదాహరణకు, 2ఉః ప్లాన్ తీసుకున్న వినియోగదారు 1.5ఉః మాత్రమే వాడితే, మిగిలిన 0.5ఉః డేటా పూర్తిగా పోతుంది. దీనికిరిఫండ్ లేదారోల్‌ఓవర్ వంటి అవకాశంలేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేటి ఆధునిక యుగంలో మనిషికి గాలి, నీరు ఎంత అవసరమో, ఇంటర్నెట్ కూడా అంతే అవసరం. అయితే వినియోగదారులు డబ్బులు చెల్లించికొనుగోలు చేసినమొబైల్ డేటా, నిర్ణీత గడువులోగా వాడకపోతే వృథాగా పోతుంది. దీనిపై రాజ్యసభలో చర్చ జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా ఈ అంశాన్ని పార్లమెం ట్‌లో లేవనెత్తుతూ టెలికాం కంపెనీల ప్రస్తుత విధానాల్లో మార్పులు రావాలని డిమాండ్ చేశారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపా డటమే లక్ష్యంగా ఆయన పలు కీలక సంస్కరణలను ప్రతిపాదించారు. ప్రస్తుతం టెలికాం రంగంలో ఉన్న అతి పెద్ద లోపాన్ని రాఘవ్ చద్దా సభ దృష్టికి తీసుకొచ్చారు. వినియోగదారులు ప్రతిరోజూ నిర్దిష్ట డేటా పరిమితి కోసం ముందుగానే డబ్బులు చెల్లిస్తున్నారు. ఉదాహరణకు ఒక వినియోగదారు రోజుకు 2జీబీ డేటా ప్లాన్ తీసుకుంటే,, అందులో కేవలం 1.5 జీడీ మాత్రమే వాడితే, మిగిలిన 0.5జీ డేటా అర్ధరాత్రి దాటగానే ఎక్స్‌పైర్ అయిపోతుంది. వినియోగదారుడు ఇప్పటికే ఆ జేటా కోసం డబ్బు చెల్లించాడు. అలాంటప్పుడు అది వృథా కావడం లేదా వెనక్కి తీసుకోవడం బాగా లేదు అని చద్దా స్పష్టం చేశారు. ఇది ఏదో అనుకోకుండా జరుగుతున్న పొరపాటు కాదని, టెలికాం కంపెనీలు కావాలనే అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానమని ఆయన మండిపడ్డారు. దీని వల్ల వినియోగదారులు తాము పూర్తిగా వాడుకోలే ని సామర్థ్యం కోసం పదే పదే డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టెలికాం వినియోగదారుల హక్కుల ను కాపా డేందుకు రాఘవ చద్దా ప్రధానంగా మూడు ప్రతిపాదనలు తీసుకొచ్చారు.ప్రస్తుతపద్ధతిలో మిగిలిపోయిన డేటామరుసటి రోజుకు కలవదు. అలా కాకుండా ఒకరోజు మిగిలిపోయనడేటాను మరుసటి రోజు కోటాకు జోడించలా అన్ని టెలికాం సంస్థలు చర్యలు తీసుకోవా లని ఆయనకోరారు. దీనివల్ల వినియోగదారులు తాము కొనుగోలు చేసిన ప్రతి డేటాను సద్వినియోగం చేసుకోనే వీలు ఉంటుంది. కొంతమంది వినియోగదారులు నిరంతరం తమ డేటా పూర్తిగా వాడలేపోతుంటారు. అటువంటి వారి విషంలో, నెల చివరన మిగిలిపోయిన డేటాను లెక్కించి, దాని విలువను బట్టి తదుపరి నెల రీఛార్జ్ మొత్తం తగ్గింపు ఇవ్వాలని చద్దా ప్రతిపాదించారు. ఇది వినియోగదారుల ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని అన్నారు. డేటాబదిలీ అవకాశం డేటాను వినియోగదారుడి డిజిటల్ ఆస్తిగా భావించాలని రాఘవ్‌చద్దా ఒక వినూత్న ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. మనం బ్యాంకు నుంచి డబ్బులను ఇతరులకు పంపినట్టుగానే మన దగ్గర మిగిలిపోయిన డేటాను స్నేహితులకు, లేదా బంధువులకు బదిలీ చేసుకునే వెసులుబాటు ఉండాలని కోరారు. భారత్ డిజిటల్ ఇండియా దిశగా వేగంగా అడుగు లు వేస్తున్న టైంలో డిజిటల్ సేవలు అందరికీ అందుబాటులో ఉండాలని అదే సమయంలో అవి పారదర్శకంగా ఉండాలని చద్దా పేర్కొన్నారు. అది వాడినా వాడకపోయినా మీకే చెందాలి. డేటా విషయంలో కూడా ఇదే సూత్రం వర్తించాలి అన్నారు. కేవలం డేటా మాయమైపోవడం వల్ల టెలికాం కంపెనీలు కోట్లాది రూపాయల లాభాలను గడిస్తున్నాయని, ఇది వినియోగదారులను వంచించడమేనని అన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని, వినియోగదారులకు అనుకూలమైన టెలికాం విధానాలను రూపొందిం చాల్సిన అవసరం ఎంతైనా ఉందని సభలో పేర్కొన్నారు. వాడని డేటాకు సర్దుబాటు:వినియోగదా రులు నిరంతరం తక్కువ డేటా వాడితే, మిగిలిన డేటా విలువను తదుపరి రీచార్జ్‌లో తగ్గింపు రూపంలో ఇవ్వాలని సూచిం చారు. వాడని డేటాను కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల కు పంపుకునే విధానం ఉండాలని పేర్కొన్నారు. డేటాను వినియోగదారుల "డిజిటల్ ఆస్తి"గా పరిగణించాలి అన్నారు

# సంపాదకీయం

## ఆయిల్ సంక్షోభంలో భారత్!

మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో భారత్‌లో కరోనాలాంటి దుర్భర పరిస్తితులు రాబోతు న్నాయని ప్రధాని మోడీ చేసిన హెచ్చరిక మనం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితిని సూచిస్తోంది. ఎందుకంటే గల్ఫ్ ఆయిల్ దక్కితే తప్ప ఇక్కడ బండి నడవని పరిస్థితులు ఉన్నాయి. దేశీయంగా మనం గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నా... సోలార్ విద్యుత్ పొందుతున్నా మనమింకా స్వయం సమృద్ధి సాధించలేక పోయాం. ఇప్పుడిప్పుడే సోలార్ రంగంలో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాం. అయితే ఆయిల్‌కు ప్రత్యమ్నాయంగా మనం ఎదగడం లేదు. నేచరల్ గ్యాస్ లభ్యత అంతంత మాత్రంగానే ఉంది. చమురు వినియోగంలో రవాణా రంగానిది ప్రథమ స్థానం. రవాణా కార్యకలాపాలలో సహజవాయువు వినియోగం ఆశించిన విధంగా పెరగలేదు. రైల్వేస్‌లో సైతం డీజిల్ వినియోగం ఎక్కువే అయినా 90శాతానికి పైగా రైల్వే లైన్లు విద్యుదీకరణ కావడంతో ఆ చమురు వినియోగం 62శాతానికి తగ్గింది. విద్యుదుత్పాదనలో సహజవాయువుకు ప్రాధాన్యం అంతకంతకూ పెరిగిపోతోంది. వ్యవసాయ రంగంలో సన్నకారు రైతుల సాగు బావులకు విద్యుత్ పంపు సెట్లు అందించడం ద్వారా గ్రామీణ విద్యుత్ సరఫరాకు ఊతమివ్వడం డీజిల్ వినియోగాన్ని తగ్గించడంలో భాగమే. అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ పంపుసెట్లు ఇప్పటికీ డీజిల్‌పై ఆధారపడి ఉండగా ఎరువుల కర్మాగారాలు గ్యాస్ ఆధారితంగా ఉన్నాయి. ఎరువుల ఉత్పత్తికి అవసరమైన రసాయనాలు సైతం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి అవుతున్నాయన్న విషయం విస్మరించలేనిది. ఇరాన్‌తో యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందా అన్నది కూడా సందేహంగానే ఉంది. ట్రంప్ మూర్ఖత్వంపైనే యుద్ధం ముగింపు ఆధారపడి ఉంది. వెనిజులాను చెరపట్టినట్లుగా ఇరాన్‌ను చెరపట్టవచ్చన్న ట్రంప్ ఎత్తుగడలు ఫలించలేదు. ట్రంప్ అంచనాలు తలికిందులు అయ్యాయి. ఇరాన్ ధీటుగా స్పందిస్తోంది. వెంటనే ముగిసినా దాని తాలూకు నష్టాలు భరించి ముందుకు వెళ్లడానికి కనీసం ఓ ఐదారు నెలలు పడుతుంది. ఈ దశలో ఆయిల్ వాడకాలు తగ్గించుకోవడం మంచిది. దేశీయ ఉత్పత్తులను మాత్రమే వాడాలన్న నిబంధన రావాలి. దేశీయ వస్తువులను వాడేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకోవాలి. రైతులు పండించే పంటలకు తోడు,దేశానికి అవసరమైన పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలి. దిగుమతులను తగ్గించు కోవడం లేదా నిలిపి వేయడం అసవరం. మధ్యప్రాచ్య దేశాలలో తరచూ యుద్ధ ఉద్రిక్తతలు నెలకొనడం పరిపాటి. ఈ దేశాల చమురు ఉత్పత్తులపై ఆధారపడ్డ దేశాలు, మరీ ముఖ్యంగా భారత్ యుద్ధ పరిస్థితులు తలెత్తిన ప్రతిసారీ తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటుంది. ఇప్పుడూ అదే జరుగుతోంది. అరబ్ దేశాలు, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు ఉత్పన్నమైన ప్రతిసారీ చమురు ధరలు పెరుగుతాయి. వెనువెంటనే ద్రవ్యోల్బణం ముమ్మరమవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతికి విఘాతం వాటిల్లుతుంది. రాజకీయ అంశాలకు తోడుగా సైనిక సమీకరణలు, దౌత్య వ్యవహారాల విభిన్న సవాళ్ళ మధ్య భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు దౌత్యపరంగా భారత్ తడబాటు లేకుండా నెగ్గుకు వస్తోంది. ఎక్కడ తప్పటడుగు వేసినా భారత ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించు కోవల్సివస్తుంది. గోరుచుట్టుపై రోకటిపోటులా తాజా యుద్ధం కారణంగా చమురు ధరల పెరుగుదల, అలభ్యత వంటి ప్రతికూల పరిస్థితులలో భారత్ దెబ్బతింటోంది.. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఇప్పటికే దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధ పరిణామాలను గమనిస్తుంటే ఇదంతా ప్రపంచ వినాశనానికి దారితీసేలా ఉంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ భయాలు చెలరేగిన ప్రతిసారీ చమురు ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రపంచంలో వస్తున్న ఒడిదుడుకుల దృష్ట్యా భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై భారత ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా బొగ్గు ఉత్పత్తిని పెంచింది. 1990వ దశకంలో సరళీకృత ఆర్థిక విధానాలతో పారిశ్రామికాభివృద్ధి ఇతోధికమయిన కారణంగా చమురు, సహజ వాయువు అవసరాలు మున్నెన్నడు లేని విధంగా పెరిగిపోయాయి. వాటి దిగుమతులపై ఆధారపడడమూ అనూహ్యంగా పెరిగిపోయింది. కీలకమైన విద్యుత్ ఉత్పత్తి రంగంలో కాలుష్యకారక వాయు ఉద్గారాలను నియంత్రించేందుకు బొగ్గు వినియోగాన్ని తగ్గిస్తూ క్రమేణా సహజవాయువు వినియోగాన్ని అధికం చేశారు. అయితే విద్యుదుత్పాదనకు వినియోగిస్తున్న సహజవాయువు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేదే కావడం గమనార్హం. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అనేది దిగుమతి చేసుకుంటున్న చమురు ధరలపై ఆధారపడి ఉన్నది. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురును స్థానిక విపణిలో విక్రయించకుండా విదే శాలకు ఎగుమతి చేస్తున్నారు. అరేబియా సముద్ర తీరస్థ ఎనిమిది దేశాలు భారత్‌కు చమురు సరఫరా చేస్తున్నాయి. అదే అమెరికా నుంచిదిగుమతి చేసుకోవడానికి ప్రాధాన్యమిస్తే మార్కెట్ ఆధిపత్య ధోరణితో వ్యవహరించే ఆ ఒక్క దేశంపై మాత్రమే ఆధారపడవల్సి ఉంటుంది. అయితే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసినా ముప్పు తప్పేలా లేదు.

# కారుణ్య మరణం



నిశ్చలంగా, నిస్సహాయంగా మంచానికి పరిమితమైపోయిన హరీశ్‌రాణా వైద్య పర్యవేక్షణలో మృత్యువు ఒడికి చేరాడు. పదమూడేండ్ల క్రితం ఆ యువకుడు నాలుగంతస్థుల హాస్టల్ భవనం పైనుంచి కింద పడిపోయి ఇక లేవలేదు. తీవ్రగాయాలతో దవాఖానలో చికిత్స పొందాడు. తలకు బలమైన గాయం వల్ల కోమాలోకి వెళ్లాడు. అప్పటినుంచి మంచానికి పరిమితమయ్యాడు. తల్లిదండ్రులు ఇంటిదగ్గరే అతనికి చికిత్స కొనసాగించారు. కృత్రిమంగా ఆహారం, నీరు ఎక్కించడం ద్వారా వైద్యులు అతడి ప్రాణాలు కొంతకాలం పాటు నిలిపారు. రోజురోజుకూ కృశించిపోయి నిరర్థక స్థితికి చేరుకొన్న హరీశ్‌కు కారుణ్య మరణం ప్రసాదించమని అతని తల్లిదండ్రులు సుదీర్ఘ న్యాయపోరాటమే చేశారు. 2024లో వారు వేసిన మొదటి కేసును ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. 'శ్వాస తనంతట తాను తీసుకోగలుగుతున్నాడు కనుక కారుణ్య మరణం కోసం అనుమతించలేం' అంటూ రాణా తల్లిదండ్రు అభ్యర్థనను తిరస్కరించింది. ఆ తర్వాత సుప్రీంకోర్టు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. అనంతరం అతని ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. దాంతో హరీశ్ తల్లిదండ్రులు మరోసారి దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. చిట్టచివరకు ఈనెల 11న సుప్రీంకోర్టు అతనికి గౌరవప్రదమైన మరణాన్ని కల్పించాలని ఆదేశించింది. భారత న్యాయవ్యవస్థలో ఇదొక మైలురాయి తీర్పు. ఢిల్లీ ఎయిమ్స్ దవాఖాన వైద్యుల పర్యవేక్షణలో ప్రాణ రక్షక చికిత్సా వ్యవస్థను ఉపసంహరించిన తర్వాత ఈనెల 24న హరీశ్ అంతిమ శ్వాస విడిచాడు. న్యాయవ్యవస్థ అనుమతితో మన దేశంలో జరిగిన తొలి కారుణ్య మరణం ఇది. 'కొన్ని సందర్భాల్లో మనిషి ప్రాణం తీయడం తప్పనిసరి అవుతుంది. నిత్య నరకం అనుభవిస్తూ కోలుకొనే అవకాశాలు అడుగంటి, చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడే దురదృష్ట జీవులకు మరణమే ఆశాకిరణమవుతుంది. వారికి ప్రశాంతమైన, గౌరవప్రదమైన మరణాన్ని ప్రసాదించడం కనీస మానవధర్మం అవుతుంది' అనే వాదన చాలాకాలంగా నలుగుతున్నది. దీనినే 'కారుణ్య మరణం' అని పరిగణిస్తున్నారు. ఇది బతుకుతారనే ఆశ ఏమాత్రం లేని రోగిని మృత్యువు ఒడిలో కావాలని చేర్చి నిద్రపుచ్చడం తప్ప మరోటి కాదు. అయితే ఆ మరణం ఎలా సాధ్యమవ్వాలి? మనంతట మనమే ఏదైనా వైద్యపరమైన చర్య ద్వారా రోగి చనిపోయేలా చేయాలా? దీనినే 'సక్రియాత్మక కారుణ్య మరణం' లేదా 'యాక్టివ్ యూథనేషియా' అని అంటున్నారు. వైద్య నిపుణుల సహాయంతో జరుగుతుంది కనుక దీనిని 'అసిస్టెడ్ యూథనేషియా' అని కూడా అంటున్నారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ యాక్టివ్ యూథనేషియా చట్టబద్ధంగానే అమలవుతున్నది. 'నిష్క్రియాత్మక కారుణ్య మరణం' లేదా 'పాసివ్ యూథనేషియా' అనేది దీనికి ప్రత్యామ్నాయంగా ఉన్నది. ఇందులో ప్రాణాధార చికిత్సా వ్యవస్థ ఉపసంహరణ లేదా నిలుపుదల ద్వారా మరణం సంభవిస్తుంది. ఈ రెండో విధానం వైపే భారత్ మొగ్గుచూపింది. అయితే ఇప్పటివరకు ఇది అమల్లోకి రాలేదు. కాగా, మొదటిదైన సక్రియాత్మక కారుణ్య మరణాన్ని మనదేశం నేరంగా పరిగణిస్తున్నది. అంటే ఎవరైనా (అది వైద్యుడైనా కావచ్చు) ఆత్మహత్యలో సహకరిస్తే శిక్షార్హులవుతారు.

పాసివ్ యూథనేషియాలోనూ మెడికల్ బోర్డుల నివేదికలు తప్పనిసరి. హరీశ్ విషయంలో అతను యంత్రాల సాయంతో ఊపిరి తీసుకుంటున్నాడని, కోలుకొనే అవకాశాలేమీ లేవని రెండు బోర్డులూ తేల్చిచెప్పాయి. ఆ సిఫారసుల ఆధారంగానే సర్వోన్నత న్యాయస్థానం కారుణ్య మరణానికి అనుమతించింది. నిజానికి 2011లో అరుణా షాన్‌బాగ్ కేసులో కారుణ్య మరణంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బ్రెయిన్ డెడ్ కానందువల్ల ఆమెకు కారుణ్య మరణం కల్పించేందుకు అనుమతి నిరాకరించింది. దాంతో 2015లో ఆమె సహజ మరణాన్ని పొందింది. కాకపోతే అదే తీర్పులో పాసివ్ యూథనేషియాను సమర్థించడం విశేషం. కచ్చితంగా పాటించవల్సిన మార్గదర్శకాలను వెలువరించింది. ఇప్పుడు అవే మార్గదర్శకాల వెలుగులో హరీశ్‌రాణా కారుణ్య మరణానికి సుప్రీం అనుమతించడం, అతడు శాశ్వత నిద్రలోకి జారుకోవడం ఓ కీలకమైన మలుపుగా నిలిచింది.

# హైదరాబాద్‌లో కల్తీల మయం?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ప్రజలు ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ మాఫియా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. బుధవారం నగరం అంతటా నిర్వహించిన వరుస దాడుల్లో కుళ్లిన కోడిగుడ్లు, నిషేధిత రసాయనాలు వాడుతున్న బేకరీ కేంద్రాలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ యూనిట్లను సీజ్ చేశారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 9 మందిని అరెస్టు చేసి, భారీ మొత్తంలో కల్తీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో ప్రాణాంతక రసాయనాలను ఉపయోగిస్తూ ఆహార పదార్థాలను తయారు చేస్తున్న కేంద్రాలపై సిటీ టాస్క్ ఫోర్స్, ఫుడ్ అడల్టరేషన్ విభాగం అధికారులు మెరుపుదాడులు చేశారు. ఈ దాడుల్లో ప్రదానంగా చిన్న పిల్లలు ఇష్టంగా తినే బిస్కెట్లు, కేకులు మొదలు కొవి ప్రతి వంటింట్లో వాడే అల్లం వెల్లుల్లి పేస్ట్ వరకు అన్నీకల్తీ అవుతున్నట్టు అధికారులు గుర్తించారు. కాటేదాన్, రాజేంద్ర నగర్, బేగంబజార్, అత్తాపూర్ వంటి ప్రాంతాల్లో సాగుతున్న ఈ అక్రమ దందాను అరికట్టేందుకు పోలీసులు ఏక కాలంలో దాడులు చేసి నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో లక్షల రూపాయల విలువలైన నిల్వలు, యంత్రాలు సీజ్ చేశారు.

కుళ్లిన కోడిగుడ్లతో బేకరీ పదార్థాల తయారీ!: కాటేదాన్ పరిధిలోని ఇంద్ర సొసైటీలో ఉన్న మధురై మీనాక్షి ఫుడ్ కంపెనీలో జరుగుతున్న తయారీ విధానం అధికారులను విస్మయానికి గురి చేసింది. ఇక్కడ చిన్న పిల్లలు తినే డోనట్స్, కేకులు, బిస్కెట్ల తయారీలో పచ్చిగా కుళ్లిపోయిన కోడిగుడ్లను వాడుతున్నట్టు గుర్తించారు. ఈ కేంద్రంలో సూపర్‌వైజర్ అఫ్రిదీ అన్సారీ, మేనేజ్ యాసిన్, ఖత్రేషన్ అనే ముగ్గురు వ్యక్తులు కలిసి ఈ కల్తీ వ్యాపారాన్ని నడుపుతున్నారు. వీరి వద్ద నుంచి కుళ్లిన కోడిగుడ్లు, పాడైపోయిన డోన్స్, కేకులు, డాల్డా, మిల్క్ పౌడర్, సోడియం బెంజోయేట్ , సోర్బిక్ యాసిడ్, పొటాషియం, సోర్బేట్, అమ్మోనియా సల్ఫేట్ వంటి ప్రమాదకర రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ రసాయనాలు మోతాదుకు మించి వాడటం వల్ల ప్రజల ఆరోగ్యం, ముఖ్యంగా పిల్లల నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని అధికారులు చెబుతున్నారు.

యాసిడ్లతో అల్లం వెల్లుల్లి పేస్ట్ కల్తీ : నిత్యం ఇంట్లో వాడే అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను కూడా ఓ బ్యాచ్ విషతుల్యం చేస్తున్నారు. రాజేంద్రనగర్, ఎంఎం పహాడీ ప్రాంతాల్లో డెక్కన్ ట్రేడర్స్ పేరుతో రెండు గోడౌన్లను నడుపుతున్న సోహెల్ చానియా, రహీమ్ చరానియా, అమిత్ చరానియాను పోలీసులు అరెస్టు చేశారు. వీరు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందాలనే ఉద్దేశంతో శాంటానిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, సింథటిక్ ఫుడ్ కలర్లను వాడుతున్నారు. అల్లం, వెల్లుల్లి కంటే ఎక్కువగా వెల్లుల్లి పొట్టును కలిపి ఈగలు ముసురుతున్న అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో పేస్ట్ తయారు చేస్తున్నారు. సుమారు 70 క్వింటాళ్ల కల్తీ పేస్ట్‌ను, యాసిడ్ టిన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఈ పేస్ట్‌ను నగరంలోని హోల్‌సేల్ దుకాణాలకు, క్యాటరింగ్ సర్వీస్‌లకు సరఫరా చేస్తున్నట్టు దర్యాప్తులో తేలింది.

బ్రాండెడ్ పేరుతో నాసిరకం కొబ్బరి పొడి : బేగం బజార్‌లో చేతక్ అనే ప్రముఖ బ్రాండ్ పేరుతో నాసిరకం కొబ్బరి పొడిని విక్రయిస్తున్న నకుల్ మరోటియా అనే వ్యక్తిని గోషామహల్ పోలీసులు అరెస్టు చేశారు. అతను కర్నాటక నుంచి అత్యంత తక్కువ ధరకు లభించే నాణ్యత లేని కొబ్బరి పొడిని తెచ్చి, బ్రాండెడ్ కవర్లో ప్యాకింగ్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నాడు. సుమారు 21 లక్షల విలువైన 8,300కిలోల కొబ్బరి పొడిని పోలీసులు సీజ్ చేశారు.

నకిలీ ఐస్‌క్రీమ్ పార్లర్ల ఆగడాలు: అత్తాపూర్‌లో జైబోలేనాథ్ అనే పేరుతోఎలాంటి అనుమతులు లేకుండానే ఐస్‌క్రీమ్ పార్లర్‌ను నిర్వహిస్తున్న కేంద్రంపై కూడా అధికారులు దాడులు చేశారు. అసలైన కంపెనీ పేరును వాడకుంటూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బీసే రంగులు, తక్కువ నాణ్యత గల క్రీములో ఐస్‌క్రీమ్ తయారు చేస్తున్నారు. అసలైన కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో ఇద్దర్ని అరెస్టు చేశారు.

## జవాన్ బానోత్ దశరథ్ రక్తదానం




**కారేపల్లి,తెలంగాణ దిశ :** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన జవాన్ బానోత్ దశరథ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకుంటూ అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. లేహ్--లడాక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న దశరథ్ అక్కడి సోనం హాస్పిటల్‌లో ఓమహిళకు అత్యవసరంగాదీ పాజిటివ్ రక్తం అవ సరం ఏర్పడగా తనది అదే గ్రూప్ రక్తం కావడంతో వెంటనే ఆస్ప త్రికి వెళ్లి రక్తదానం చేశాడు. దీంతో వైద్యులు సదరు మహిళకు చికిత్స అందించి ప్రాణాలను కాపాడగలిగారు. దశరథ్ సేవలకు తోటి సైనికులు, ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

# ప్రాణం తీస్తున్న వేగం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** విశాలమైన రోడ్డు.. ఏమాత్రం గతుకులు ఉండవు. వేగంగా దూసుకుపోవచ్చు. ధ్వని వేగంతో సమానంగా వాహనాన్ని నడపవచ్చు. అందువల్లే చాలామంది బాహ్య వలయ రహదారి మీద ప్రయాణించడాన్ని ఆనందిస్తుంటారు. ఔటర్ కేవలం రోడ్డు మాదిరిగానే కాకుండా.. చుట్టూ వృక్షాలు.. పూల మొక్కలతో కనువిందు చేస్తూ ఉంటుంది. అందువల్లే ఆ ప్రకృతిని చూస్తూ చాలామంది వేగంతో వెళ్తూ ఉంటారు.ఔటర్ రింగ్ రోడ్డు మీద స్పీడోమీటర్లు ఉన్నప్పటికీ చాలామంది వేగాన్ని ఆస్వాదిస్తూ ముందుకు వెళ్తుంటారు. అందువల్ల ట్రాఫిక్ చలాన్లకు గురవుతూ ఉంటారు. ఆ మధ్య మహేష్ బాబు ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగంతో వెళ్లడంతో.. చలాన్ నమోదయింది. దీనిని బట్టి ఔటర్ రింగ్ రోడ్డు మీద సెలబ్రిటీలు.. ప్రజా ప్రతినిధులు ఏ స్థాయిలో ప్రయాణం సాగిస్తుంటారో అర్థం చేసుకోవచ్చు.ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్సీ అజహారుద్దీన్ కుమారుడు తన విలాసవంతమైన బైక్ మీద అవుటర్ రింగ్ రోడ్డు మీద ప్రయాణించాడు. మితిమీరిన వేగంతో ప్రయాణించడంతో ప్రమాదానికి గురయ్యాడు. ఆ ప్రమాదంలో అతడు దుర్మరణం చెందాడు. అప్పట్లో సినీ హీరో రాజశేఖర్ కారు కూడా ప్రమాదానికి గురైంది. దాని కారణం కూడా మితిమీరిన వేగమని తెలుస్తోంది. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఎమ్మెల్యేగా ఉన్న ఆమె ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగంతో వెళ్లడంతో.. ప్రమాదం జరిగింది. అప్రమాదంలో లాస్య నందిత చనిపోయింది.ఇప్పుడు దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుమార్తెలు ఔటర్ రింగ్ రోడ్డు మీద ప్రయాణిస్తుండగా.. వారి వాహనం ప్రమాదానికి గురైంది. ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టడంతో వారి ప్రయాణిస్తున్న కారు ధ్వంసం అయింది. మాగంటి గోపీనాథ్ ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తె అక్షర తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం ఆమె అత్యంత విషమ పరిస్థితిని ఎదుర్కొంటున్నది. గచ్చిబౌలి లోని ఏఐజి ఆసుపత్రిలో ఆమెకు చికిత్స అందిస్తున్నారు.. ఔటర్ రింగ్ రోడ్డు మీద ప్రజాప్రతినిధులు ఇలా వరుసగా గాయపడడం లేదా మృతి చెందడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్న తీరుగ్రాభ్రాంతి కలిగిస్తోంది.

# అమెరికా ఎయిర్‌పోర్టుల్లో గందరగోళం..



సెక్యూరిటీ చెకప్‌కే 4 గంటలు!

అమెరికా: అమెరికాలోని ప్రధాన విమానాశ్రయాలు ప్రస్తుతం ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. దేశంలో కొనసాగుతున్న పాక్షిక ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా భద్రతా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో సెక్యూరిటీ చెకప్‌ల కోసం ప్రయాణికులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోంది. ఈ జాప్యం వల్ల చాలా మంది తమ విమానాలను కూడా కోల్పోతున్నారు. ఫిబ్రవరి మధ్య నుంచి కొనసాగుతున్న షట్‌డౌన్ ప్రభావం ఇప్పుడు విమానాశ్రయాలపై తీవ్రంగా పడింది. ట్రాన్స్‌పోర్టేషన్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ (టీఎస్‌ఏ) సిబ్బందికి జీతాలు అందకపోవడంతో చాలామంది అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్నారు. ఫలితంగా, ప్రధాన ఎయిర్‌పోర్టుల్లో భద్రతా తనిఖీల కోసం ప్రయాణికులు సుమారు 3 నుంచి 4 గంటల పాటు వేచి చూడాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. సిబ్బంది కొరత వల్ల కౌంటర్లు కిక్కిరిసిపోతున్నాయి.పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఇమిగ్రేషన్, హోంలాండ్ సెక్యూరిటీ అధికారులను కూడా ప్రభుత్వం రంగంలోకి దించింది. అయినప్పటికీ ప్రయాణికుల రద్దీని నియంత్రించడం కష్టంగా మారింది. దీంతో అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. విమానాశ్రయాల్లో భద్రతను పర్యవేక్షిం చేందుకు నేషనల్ గార్డ్ దళాలను మోహరించాలని ఆదేశించారు. అయితే, సిబ్బంది కొరత ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా విమాన రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉందని అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## మీ పిల్లల్లో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచాలంటే

# ఈ ఆహారాలను రోజూ తినిపించండి..!

సీజన్లు మారినప్పుడల్లా సహజంగానే చాలా మందికి దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తుంటాయి. చిన్నారులకు అయితే తరచూ ఈ సమస్యలు వస్తాయి. ఎల్లప్పుడూ వారు జలుబుతో ఇబ్బంది పడుతుంటారు. అయితే వారు తీసుకునే ఆహారంలో మార్పులు చేస్తే దాంతో వారి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాని వల్ల వారికి దగ్గు, జలుబు వంటి అనారోగ్య సమస్యలు రాకుండా అడ్డుకట్ట వేయవచ్చు. చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచితే వారికి ఎలాంటి రోగాలు రాకుండా చూడవచచు.


అందుకు గాను పలు ఆహారాలను తరచూ ఇవ్వాల్సి ఉంటుంది. వాటితో ఇమ్యూనిటీ పెరగడమే కాదు, వారి శరీరానికి కావల్సిన పోషకాలు, శక్తి కూడా లభిస్తాయి. ఇక చిన్నారుల్లో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచే ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

సిట్రస్ పండ్లు..: సిట్రస్ జాతికి చెందిన పండ్లను ఇస్తుంటే చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. నారింజ, నిమ్మ, గ్రేప్ ఫ్రూట్ వంటి పండ్లను వారికి ఇస్తుండాలి. వీటిల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. అలాగే స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీలను కూడా ఇవ్వవచ్చు. వీటిల్లో విటమిన్ సి తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి పిల్లల్లో ఇమ్యూనిటీని పెంచుతాయి. ఆకుపచ్చని కూరగాయలు లేదా ఆకుకూరలను కూడా పిల్లలకు పెడుతుండాలి. పాలకూర, బ్రోకలీ వంటి కూరగాయల్లో విటమిన్లు ఎ, సి, ఇ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. చిలగడదుంపలలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఈ ఆహారాలను పిల్లలకు తినిపిస్తే వారిలో రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు.

కోడిగుడ్లు..: కోడిగుడ్లలో ప్రోటీన్లతోపాటు విటమిన్ ఎ, బి12 సెలీనియం అధికంగా ఉంటాయి. జింక్ కూడా పుష్కలంగానే ఉంటుంది. కోడిగుడ్లను రోజుకు ఒకటి చొప్పున పిల్లలకు ఇస్తుండాలి. ఇవి వారిలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. చికెన్, చేపల్లోనూ ప్రోటీన్లు, జింక్ ఎక్కువగానే ఉంటాయి. ఇవి కూడా ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతాయి. తరచూ వీటిని పిల్లలకు ఆహారంలో పెడుతుండాలి. బాదంపప్పు, వాల్ నట్స్ వంటి నట్స్‌తోపాటు చియా సీడ్స్, పొద్దు తిరుగుడు విత్తనాలు వంటి విత్తనాలను కూడా పిల్లలకు పెట్టాలి. వీటిల్లో విటమిన్ ఇ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి చిన్నారుల ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతాయి. రోగాలు రాకుండా చూస్తాయి.

పెరుగు..: పెరుగు మంచి ప్రొ బయోటిక్ ఆహారం. దీన్ని పిల్లలకు రోజూ పెట్టాలి. కొందరు పిల్లలు పెరుగు తినేందుకు ఇష్టపడరు. అలాంటప్పుడు నేరుగా దాన్ని పెట్టకుండా అందులో కాస్త చక్కెర లేదా పండ్ల ముక్కలు కలిపి ఇవ్వాలి. దీంతో వారు పెరుగును ఇష్టంగా తింటారు. పెరుగు జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. ఇది పిల్లల్లో జీర్ణ సమస్యలు రాకుండా చూస్తుంది. వెల్లుల్లి, అల్లం వంటి ఆహారాలను కూడా పిల్లలకు ఇస్తుండాలి. వీటిల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఇలా పలు రకాల ఆహారాలను పిల్లలకు పెట్టడం వల్ల వారిలో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచవచ్చు. వారిలో వ్యాధులు రాకుండా చూడవచ్చు. ఆరోగ్యంగా ఉంటారు.

## పుస్తకాలు చదవడం ఆత్మవిశ్వాసాన్ని పెంచే అలవాటు..



పుస్తకాలు చదవడం అనేది మన జీవితంలో అత్యంత ఉపయోగకరమైన అలవాట్లలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఇది మన యొక్క వ్యక్తిత్వాన్ని పెంపొందించే, మన ఆలోచనలను విస్తరించే మరియు మన అనుభవాలను పెంచే గొప్ప మార్గం. పుస్తకాలు చదవడం మనకు కేవలం కొత్త సమాచారం మాత్రమే అందించదు, దానితో పాటుగా మనిషి యొక్క ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మొదటిగా, పుస్తకాలు చదవడం మన ఆలోచనా శక్తిని పెంచుతుంది. రకరకాల పుస్తకాలు, పాఠాలు చదవడం మనం ముందుగా ఊహించని కొత్త ఆలోచనలను, దృక్కోణాలను మనలో నింపుతుంది. ఈ మార్పులు మన ఆలోచనల్లో కొత్త దారులు తెరవడమే కాకుండా సమస్యలను పరిష్కరించడంలో సహాయపడతాయి. పుస్తకాలు మనకు విజ్ఞానాన్ని, విద్యను అందిస్తాయి. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవడం ద్వారా మన మనస్సును తెరవడానికి, మరియు ప్రస్తుతానికి సరిపడే అభిరుచులను పెంచుకోవడానికి అవకాషం లభిస్తుంది.

వ్యక్తిగత అభివృద్ధి కోసం సాహిత్యం, చరిత్ర, విజ్ఞానం, సైన్స్, సాంఘిక శాస్త్రాలు వంటి విభిన్న విభాగాల్లో పుస్తకాలు చదవడం చాలా ముఖ్యమైంది. అలాగే, పుస్తకాలు మన సమయాన్ని సక్రమంగా వినియోగించడానికి సహాయపడతాయి. టీవీ లేదా సోషల్ మీడియా చూస్తున్నప్పుడు మన సమయం వృథా అవుతుంది, కానీ పుస్తకాలు చదవడం ద్వారా మనం కొత్తగా నేర్చుకుంటూ సమయాన్ని సృజనాత్మకంగా ఉపయోగించుకోవచ్చు.

# గ్రీన్‌టీతో డయాబెటిస్ అదుపులో ఉంటుందా..?

## షుగర్ బాధితులంతా ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే..!



డయాబెటిస్ అనేది తీవ్రమైన ఆరోగ్య సమస్యల్లో ఒకటి. ఇది అన్ని వయసుల వారిలో కనిపిస్తుంది. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ డయాబెటిస్‌కి బాధితులుగా మారుతారు. షుగర్ వ్యాధిని అదుపులో ఉంచుకునేందుకు జీవనశైలి, ఆహారం రెండింటినీ మెరుగుపరుచుకోవడం అవసరం. దీన్ని అదుపులో ఉంచుకునేందుకు గ్లైసెమిక్ ఇండెక్స్ 55 కంటే తక్కువ ఉన్న వాటినే తినాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వీటినే తీసుకుంటే షుగర్ వేగంగా పెరిగే ప్రమాదం ఉండదని పేర్కొంటున్నారు. చక్కెర పెరగకుండా నిరోధించేందుకు క్రమం తప్పకుండా గ్రీన్ టీ తాగడం అలవాటు చేసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. గ్రీన్ టీ అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా.. ప్రపంచవ్యాప్తంగా దాని డిమాండ్ పెరిగింది. ఇది అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించే ప్రభావవంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. గ్రీన్ టీ డయాబెటిస్‌కి ఆరోగ్యంపరంగా ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. గ్రీన్ టీ కేవలం రిఫ్రెషర్ పానీయం మాత్రమే కాదని.. వ్యాధుల నుంచి దూరంగా ఉంచడంలో ఇది సహాయపడుతుంది. రక్తంలో షుగర్ లెవల్స్‌ని నియంత్రించేందుకు మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి గ్రీన్ టీ గొప్ప పానీయమని పరిశోధకులు గుర్తించారు. గ్రీన్ టీలో కాటెచిన్ అనే మూలకం ఉంటుంది. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడానికి ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. గ్లూకోజ్‌ను గ్రహించే కణాల సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా రక్తంలో చక్కెరను సమర్థవంతంగా నియంత్రించడంలో ప్రయోజనం పొందొచ్చు. మెడిటేరియన్ డైట్ ప్లాన్‌లో గ్రీన్ టీని చేరిస్తే టైప్-2 డయాబెటిస్‌ని నివారించడంలో సహాయపడుతుందని పరిశోధన చూపిస్తుంది. దీన్ని అలవాట్లు చేసుకున్న వ్యక్తులకు డయాబెటిస్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉన్నది. పరిశోధనలో, గ్రీన్ టీ ఇన్సులిన్ కార్యకలాపాలను పెంచడంలో, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు గుర్తించారు.

అధ్యయనాల్లో ఏం గుర్తించారంటే..?: కొన్ని అధ్యయనాల ప్రకారం.. ప్రతిరోజూ రెండు నుంచి మూడు కప్పుల గ్రీన్ టీ తాగేవారికి టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 19శాతం తక్కువగా ఉండవచ్చు. ఈ పానీయాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ఉపవాసం సమయంలో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఇది కంటి సమస్యలు, గుండె సమస్యలు, నరాల సమస్యలు వంటి మధుమేహం వల్ల కలిగే ఇతర సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. డయాబెటిస్ నిర్వహణలో బరువు నియంత్రణ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. జీవక్రియను పెంచడం ద్వారా బరువు తగ్గడంలో గ్రీన్ టీ మీకు సహాయపడుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంటుంది. గ్రీన్ టీ తాగడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో, రక్తపోటును సమతుల్యం చేయడంలో కూడా సహాయపడుతుందని అధ్యయనాలు గుర్తించాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో ఇది సహాయపడే పానీయమని స్టడీస్ చెబుతున్నాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఓ అధ్యయనం ప్రకారం గ్రీన్ టీ తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని 31శాతం తగ్గించుకోవచ్చు. అయితే, గుండె ఆరోగ్యానికి గ్రీన్ టీ వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోవడానికి మరిన్ని క్లినికల్ ట్రయల్స్ అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.

# కొబ్బరినీళ్లకు తోడుగా..

వేసవితాపాన్ని తీర్చడంలో కొబ్బరినీళ్లు ముందుంటాయి. పొటాషియం, మెగ్నీషియం, సోడియంలాంటి ఎలక్ట్రోలైట్లతోపాటు అనేక పోషకాలతో నిండిన ఈ నీళ్లు.. ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. శరీరాన్ని హైడ్రేటె డ్‌గా ఉంచడంతోపాటు కండరాలు, నరాల పనితీరుకు మద్దతుని స్తాయి. అలాంటి కొబ్బరినీళ్లకు ఇతర పదార్థాలను జోడించడం ద్వారా మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు సమకూరుతాయి.

పుదీనా : కొబ్బరి నీళ్లకు పుదీనాను జోడిస్తే.. అద్భుతమైన రిఫ్రెషింగ్ డ్రింక్ తయారవుతుంది. ఇది శరీరాన్ని చల్లబరచడంతోపాటు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమర్థంగా పనిచేస్తుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది. పుదీనాలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు.. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

నిమ్మరసం : విటమిన్ సితోపాటు హైడ్రేషన్‌కు మద్దతునిచ్చే ఎంజైమ్‌లు నిమ్మరసంలో పుష్కలంగా ఉంటాయి. ఆమ్ల స్వభావం కలిగిన నిమ్మరసం, ఆల్కలీన్ కొబ్బరినీళ్లతో కలిసి.. శరీర పీహెచ్‌ను సమతుల్యం చేయడంలో సాయపడుతుంది.

తేనె : కొబ్బరినీళ్లకు తేనె కలిపి తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆయుర్వేదం చెబుతున్నది. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, ఎంజైములు, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కొబ్బరినీటిలోని ఖనిజాలతో కలిసి.. ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తిని శరీరానికి అందిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యానికి అండగా నిలుస్తాయి.



చియా విత్తనాలు : ఫైబర్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభించే చియా విత్తనాలను కొబ్బరినీళ్లలో కలిపితే.. శరీరానికి కావాల్సిన శక్తినిచ్చే పానీయం సిద్ధమవుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరం ఎక్కువసేపు హైడ్రేటెడ్‌గా ఉండటంలో సహాయపడుతుంది. గుండె, మెదడు ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది.

నల్ల ఉప్పు : కొబ్బరినీళ్లలోని పొటాషియం, మెగ్నీషియం.. నల్ల ఉప్పులోని సోడియం, ఐరన్, సల్ఫర్ వంటి ఖనిజాలు కలిసి.. ఎలక్ట్రోలైట్ రిచ్ డ్రింక్‌గా తయారవుతుంది. నల్ల ఉప్పులోని కార్మినేటివ్ లక్షణాలు.. ఆకలిని నిరోధిస్తాయని ఆయుర్వేదం చెబుతున్నది. ఇవి కొబ్బరినీళ్లతో కలిసినప్పుడు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

# దురలవాట్లతో కాలేయ అనారోగ్యం



కాలేయం లేదా లివర్ అనేది శరీర అవయవాల్లో అతి పెద్దది మాత్రమే కాకుండా అత్యంత ప్రధానమైనదిగా వైద్య రంగం వర్గీక రించింది. సక్రమ జీవ వ్యవస్థ కొనసాగింపు, విష పదార్థాలను వడపోసి విసర్జిం చడం, అత్యవసర జీవ పదార్థాలను తయారు చేయడం, జీర్ణ వ్యవస్థ నుంచి పోషకాలతో నిండిన మంచి రక్తాన్ని తీసుకొని శరీర అవయవాలకు సరఫరా చేయటం లాంటి 500 పైగా విధులను నిర్వహిస్తూ మనకు నిత్య ఆరోగ్య సౌభాగ్యాన్ని కాలేయం అందిస్తున్నది. మన చెడు అలవాట్ల ప్రభావం ప్రత్యక్షంగా కాలేయం మీదనే పడుతుందనే కనీస పరిజ్ఞానర మనకు వుండాలి. లివర్ ఆరోగ్యమే మన ఆరోగ్యమని తలచి జీవనశైలిని మార్చుకోవాలి. ప్రపంచవ్యాప్తం గా దాదాపు 20 లక్షల మంది కాలేయ సంబంధ వ్యాధులతో చనిపోతున్నారని, మరణానికి కారణమైన వ్యాధుల్లో లివర్ వ్యాధులు కూడా ఉన్నాయని తెలుసుకోవాలి. అన్ని వయసుల వారిలో దాదాపు 30 శాతం మందిని కాలేయ సంబంధ రుగ్మతలు వేధిస్తున్నట్లు అంచనా వేస్తున్న వేళ మన కాలేయాన్ని మనమే రక్షించుకోవడం అత్యవసరం.

శరీరానికి శక్తినిచ్చే కేంద్రంగా విలక్షణ విధులను నిర్వహిస్తున్న కాలేయం పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 19 ఏప్రిల్ రోజున ''ప్రపంచ కాలేయ దినం'' పాటిస్తున్నాం. ఈ ఏడాది ఇతివృత్తంగా ''ఆహారమే ఔషధం'' అనే అంశాన్ని తీసుకొని విస్తృత ప్రచారం చేస్తున్నారు. మన తీసుకునే ఆహారమే మన లివర్ ఆరోగ్యానికి లేదా అనారోగ్యానికి హేతువుగా మారుతుందని గమనించాలి.

ఆల్కహాల్ సేవనం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, స్థూలకాయం, అనవసర ఔషధాల దుష్ప్రభావం, జన్యుపరమైన అంశాలు, దీర్ఘకాలిక అనారోగ్యాల కారక జీవనశైలి లాంటి అంశాలు కాలేయ అనారోగ్యానికి హేతువులు. దురలవాట్లు పెరిగి పెరిగి ఫ్యాటీ లివర్, హెపటైటిస్ (కామెర్లు), లివర్ ఫెయిల్యూర్, లివర్ క్యాన్సర్, లివర్ సిర్రోసిస్ లాంటి ప్రాణాంతక కాలేయ అనారోగ్యాలు కలుగుతాయి. చెడు అలవాట్లు మితిమీరి చర్మం/కళ్లు పసుపు పచ్చగా మారడం, కడుపు నొప్పి లేదా వాపు రావడం, అకారణంగా బరువు తగ్గడం, ఆకలి మందగించడం, మూత్రం ముదురు పసుపు రంగులోకి మారడం, చర్మ దురద లాంటి పలు రోగ లక్షణాలు కనిపిస్తాయి. మన జీవనశైలిలో పలు మార్పులు చేసుకొన్నపుడు మన కాలేయం ఉత్తేజితమౌతుంది. ఆరోగ్యం సమకూరుతుంది. నిత్యం శారీరక వ్యాయామం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, ఆల్కహాల్ సేవన దురలవాటుకు దూరంగా ఉండడం, విష పదార్థాలకు ఎక్స్‌పోజ్ కాకుండా ఉండడం లాంటి అంశాలు మన కాలేయ ఆరోగ్యానికి పునాదులుగా మారతాయి. సమతుల పోషకాహారం తీసుకోవడంతో లివర్ సంబంధ అనారోగ్యాలైన కాలేయ వాపు, కాలేయ రుగ్మతలు పూర్తిగా పలుచబడి మానవ శ్రేయస్సుకు ఊతం ఇస్తాయి.

# ఆకలి సరిగ్గా అవడం లేదా.. ఆహారం తినాలనిపించడం లేదా.. అయితే ఈ చిట్కాలను పాటించండి..

**తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే అజీర్తి ఏర్పడుతుంది. దీంతో ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తింటారు. ఆకలి తగ్గేందుకు పలు ఇతర కారణాలు కూడా ఉంటాయి. జీర్ణాశయం లో ఎంజైమ్‌లు లేదా జీర్ణ రసాల ఉత్పత్తి తగ్గడం, లివర్ పనితీరు మందగించడం, మలబద్దకం, గ్యాస్ వంటి సమస్యలు ఉండడం వంటి కారణాల వల్ల కూడా ఆకలి ఉండదు. దీంతో ఆహారం సరిగ్గా తినలేకపోతుంటారు. అయితే పలు రకాల చిట్కాలను పాటిస్తే అజీర్తిని తగ్గించి ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేయవచ్చు. దీంతో ఆకలి కూడా పెరుగుతుంది. ఆకలి అసలు లేని వారు కొన్ని చిట్కాలను పాటిస్తే ఎంతో మేలు జరుగుతుంది. ఇక ఆ చిట్కాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**

**మిరియాలు..:** ఆకలిని పెంచడంలో మిరియాలు అద్భుతంగా పనిచేస్తాయి. మిరియాలను పొడిగా చేసి చిటికెడు మోతాదులో తీసుకుని కాస్త తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం భోజనానికి 30 నిమిషాల ముందు చప్పరించాలి. దీంతో అజీర్తి తగ్గుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. మిరియాల పొడిని మజ్జిగలో కలిపి తాగుతున్నా ఉపశమనం లభిస్తుంది. ఆకలి పెరుగుతుంది. మిరియాలలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచుతాయి. జీర్ణ రసాలు సక్రమంగా ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో ఆకలి పెరుగుతుంది. మిరియాలను తేనెతో కలిపి తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే మలబద్దకం తగ్గుతుంది. మిరియాలతో కషాయం తయారు చేసి కూడా తాగవచ్చు.

**అల్లం రసం..:** ఆకలిని పెంచేందుకు అల్లం రసం కూడా ఎంతో పనిచేస్తుంది. ఒక టీస్పూన్ అల్లం రసాన్ని ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు సేవించాలి. అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవన్నీ పైత్యాన్ని తగ్గిస్తాయి. వికారం, అజీర్తి సమస్యల నుంచి బయట పడేస్తాయి. ఆకలి పెరిగేలా చేస్తాయి. ఆకలి లేని వారు రోజూ అల్లం రసాన్ని



తాగుతుంటే ఫలితం ఉంటుంది. అలాగే ఉసిరికాయ జ్యూస్‌ను రోజూ తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఉసిరికాయల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఉండే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీంతో అజీర్తి తగ్గి ఆకలి పెరుగుతుంది. రోజూ ఉదయం పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో ఉసిరికాయ జ్యూస్‌ను తాగుతుంటే మంచి ఫలితం ఉంటుంది.

**యాలకులు..:** యాలకులను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. భోజనం చేసిన తరువాత రాత్రి పూట ఒక యాలక్కాయను నేరుగా అలాగే నమిలి తినాలి. ఇది అజీర్తిని తగ్గిస్తుంది. జీర్ణాశయంలో గ్యాస్ ఉత్పత్తిని అరికడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో ఆకలి పెరుగుతుంది. యాలకులను తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. అలాగే నోట్లో ఉండే బ్యాక్టీరియా తగ్గుతుంది. నోటి దుర్వాసన నుంచి ఉపశమనం లభిస్తుంది. యాలక్కాయను రాత్రిపూట తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. నిద్ర చక్కగా పడుతుంది. పిప్పిళ్ల చూర్ణం పావు టీస్పూన్ మోతాదులో తీసుకుని దానికి ఒక టీస్పూన్ తేనెను కలిపి రాత్రి పూట నిద్రకు ముందు తీసుకోవాలి. ఈ మిశ్రమం ద్వారా ఆకలి పెరగడమే కాదు, పొట్ట దగ్గరి కొవ్వు కూడా కరుగుతుంది. ఇలా పలు చిట్కాలను పాటిస్తే ఆకలిని పెంచుకోవడమే కాదు, ఇతర ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

# సౌత్ రాష్ట్రాల మధ్య సమన్వయం సాధ్యమేనా..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** నియోజకవర్గాల పునర్విభజన , సీట్ల పెంపు అంశం ఇప్పుడు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో పెను సంచల నానికి కేంద్ర బిందువుగా మారింది. జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే వాదనను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలంగా వినిపిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునివ్వడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అయితే, ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఇంకా అధికారికంగా ఎటువంటి స్పష్టమైన పాలసీని ప్రకటించలేదు.కాంగ్రెస్ పార్టీకి ఇది కత్తి మీద సాము లాంటి వ్యవహారం. ఒకవేళ దక్షిణాదికి అన్యాయం జరుగుతోం ది అని కాంగ్రెస్ గట్టిగా ఉద్యమిస్తే, అది ఉత్తరాది రాష్ట్రాల్లోని ఓటర్లను కించపరిచినట్లు అవుతుందనే భయం జాతీయ నాయకత్వంలో ఉంది. ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో జనాభా ఎక్కువగా ఉన్నందున అక్కడ సీట్లు భారీగా పెరుగుతాయి. ఆ రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలని చూస్తున్న కాంగ్రెస్‌కు, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కొంత ఇబ్బందికరంగా మారేఅవకాశం ఉంది.జాతీయ పార్టీగా దేశమంతటా ఒకే విధానాన్ని అనుసరించాల్సి ఉండటంతో, అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధోరణి చూస్తుంటే, ఆయన జాతీయ రాజకీయాల కంటే తెలంగాణ, దక్షిణాది ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నట్లు కనిపిస్తోంది. జాతీయ నాయకత్వం ఆలోచనలతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సెంటిమెంటును పట్టుకోవడంలో ఆయన సిద్ధహస్తుడు. దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో నష్టం జరిగితే, అది నిధుల కేటాయింపు, రాజకీయ ప్రాతినిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే, పార్టీ లైన్ కంటే ప్రాంతీయ ప్రయోజనాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ. 50 శాతం సీట్లు పెంచాలనే ప్రతిపాదన అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుంది కాబట్టి, దీన్ని కేవలం ఒక ప్రాంతానికి అన్యాయంగా చూడలేమని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. అయితే, దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, జనాభా పెంచుకున్న రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు ఇవ్వడం అనేది మంచి పని చేసిన వారికి శిక్ష వేయడమే అనే వాదనలోనూ పస ఉంది. ఈ క్లిష్టమైన సమస్యను నిపుణులు, మేధావులు లోతుగా విశ్లేషించాల్సిన అవసరం కనిపిస్తోంది.దేశవ్యాప్త ప్రభావం చూపే ఇటువంటి సున్నితమైన అంశాలపై ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి బహిరంగంగా ఉద్యమానికి పిలుపునివ్వడం సామాన్యమైన విషయం కాదు. ఇది భవిష్యత్తులో కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై, అలాగే కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపై ప్రభావం చూపవచ్చు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ బలంగా ఉన్న తరుణంలో, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉంది. కాంగ్రెస్ ఉత్తరాదిని వ్యతిరేకిస్తోంది అనే ముద్ర పడకుండా కాంగ్రెస్ అధిష్టానం ఎలా మేనేజ్ చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. డీలిమిటేషన్ అంశం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలను లేదా భిన్నమైన ఆలోచనా ధోరణులను బయటపెట్టింది. రేవంత్ రెడ్డి తనదైన శైలిలో దక్షిణాది సెంటిమెంటును రగిలిస్తుంటే, జాతీయ నాయకత్వం మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది.

# కేరళ అసెంబ్లీ ఎన్నికలపై ఇరాన్ యుద్ధం ప్రభావం..

**తిరువనంతపురం,తెలంగాణ దిశ :** పశ్చిమాసియాలో గత నెల 28న మొదలైన యుద్ధం.. యావత్తు ప్రపంచాన్ని అల్లకల్లోలంగా మార్చేస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ ప్రతీకార చర్యలతో పశ్చిమాసియా రగలిపోతుంది. ఈ యుద్ధం కారణంగా చమురు ధరలు పైపైకి వెళ్తున్నాయి. ఇక, మన దేశంలోని ఎన్నికలపై కూడా ఈ యుద్ధ ప్రభావం పడుతోంది. ముఖ్యంగా గల్ఫ్ దేశాల నుంచి కేరళకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోనుంది. పశ్చిమ్ బెంగాల్, తమిళనాడు, కేరళ సహా ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే నెలలో పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే.దాదాపు నెల రోజులుగా ఇజ్రాయెల్- అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతోన్న యుద్ధం ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. అయితే, ఈ సంఘర్షణ వచ్చె నెల భారత్‌లో జరగనున్న ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల పైనా ప్రభావం చూపనుంది. ముఖ్యంగా కేరళ అసెంబ్లీ ఎన్నికలపై దీని ఎఫెక్ట్ భారీగా పడే అవకాశం ఉంది. ఇది మొత్తం ఫలితాన్నే ఇది ప్రభావితం చేయకపోయినా... కొన్నిచోట్ల గెలుపోటములను నిర్దేశించొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమతున్నాయి. మొత్తం 140 స్థానాలున్న కేరళలో ఏప్రిల్ 9న ఒకే దశలో ఎన్నికల పోలింగ్ జరగనుంది.గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లే భారతీయుల్లో కేరళ వాసులే అధికం. కేరళ మైగ్రేషన్ సర్వే గణాంకాల ప్రకారం.. పశ్చిమాసియాలో దాదాపు 22 లక్షలు మంది కేరళీయలు ఉన్నారు. వీరంతా ఎన్నికల సమయంలో ఓటు వేయడానికి సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ సహా గల్ఫ్ దేశాల నుంచి సొంత రాష్ట్రానికి వస్తుంటారు. కొన్ని ప్రవాసీ గ్రూపులు వీరి కోసం ఛార్టర్డ్ విమానాలు నడుపుతుంటాయి. ప్రస్తుతం కేరళ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈస్టర్, ఇతర పండగలు ఉండటంతో అక్కడ నుంచి వచ్చేవారి సంఖ్య భారీగా ఉంటుందని భావించారు.కానీ, యుద్ధం కారణంగా వారు స్వదేశానికి వచ్చేందుకు అనుకూలమైన పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటి వరకూ వేలల్లోనే కేరళకు చేరుకున్నట్టు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈసారి గల్ఫ్ దేశాల నుంచి ఓటేయడానికి వచ్చేవారి సంఖ్య సగానికిపైగా తగ్గొచ్చని అంచనా వేస్తున్నారు. యూఏఈ కేరళ ముస్లిం కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు పుథుర్ రెహమాన్ మాట్లాడుతూ.. "ఎన్నికలప్పుడు మేము యూఏఈ నుంచి 8 చార్టర్డ్ విమానాలు ఏర్పాటుచేసేవాళ్లం. కానీ ఈసారి అలాంటి పరిస్థితి లేదు" అని అన్నారు. యుద్ధంతో విమాన ప్రయాణాలను తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వేలాదిగా విమానాలు రద్దుకావడం, దుబాయ్, అబుధాబి, దోహా వంటి చోట్ల తాత్కాలికంగా విమానాశ్రయాలను మూసివేశాయి.దీని ప్రభావం నార్త్ కేరళలోని మలప్పురం, కొజికోడ్, కాసర్‌గడ్, పాలక్కాడ్, త్రిశూర్ జిల్లాల్లోని అసెంబ్లీ స్థానాల్లో ఉండనుంది. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమిలో కీలక పార్టీ అయిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్.. గల్ఫ్ దేశాల నుంచి ఓటర్లతో ఎక్కువ లబ్ధి పొందుతుంటుంది. దీనిపై ఐయూఎంఎల్ ప్రధాన కార్యదర్శి సయ్యిది మునావర్ అలీ సాహిబ్ థంగల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కోసం చాలా మంది వచ్చే అవకాశం తక్కువగా ఉందని, అయినా వారిని రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. పరిస్థితిలో మార్పు రాకుంటే పోలింగ్ శాతం తగ్గుతుందని అన్నారు.యూఏఈలోనే కేరళ ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. యుద్ధం ఆగిపోయి సాధారణ పరిస్థితి నెలకున్నా విమాన ఛార్జీలు కూడా భారీగా పెరుగుతాయని కేఎంసీసీ యూఏఈ నేషనల్ కమిటీ జనరల్ సెక్రటెరీ అన్వర్ నాహా అన్నారు. ఇదిలా ఉండగా, మొత్తం పోలింగ్ శాతంపై ప్రవాసీ ఓటర్ల ప్రభావం స్వల్పంగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. నార్త్ కేరళలోని నియోజకవర్గాల్లోనే ప్రవాసీ ఓటర్ల అధిక సంఖ్యంలో ఉన్నప్పటికీ ఇవన్నీ భారీ మెజార్టీతో గెలిచే స్థానాలేనని, దీని ప్రభావం పరిమితమేనని అంటున్నారు


# సెక్స్‌డ్ సెమెన్ టెక్నాలజీ..

## 90 శాతం ఆడ దూడలు పుట్టే ఛాన్స్



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** సెక్స్‌డ్ సెమెన్ టెక్నాలజీ సాయంతో దేశీయ జాతులకు చెందిన ఎద్దులతో సహా అధిక జన్యు యోగ్యత కలిగిన వాటి నుంచి వీర్యం సేకరించి, కేవలం ఆడ దూడలను మాత్రమే ఉత్పత్తి చేసేలా టెక్నాలజీతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ విధానం మన తెలుగు రాష్ట్రాల్లోనూ అమల్లో ఉంది. ఇందుకోసం ప్రభుత్వం పలు రాయితీలను కూడా అందజేస్తోంది. ఈ విధానంతో 10 శాతం పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలని ఏపీ లక్ష్యంగా పెట్టుకుంది.90% వరకు కచ్చితత్వంతో కేవలం ఆడ దూడలను మాత్రమే ఉత్పత్తి చేసే లింగ నిర్ధారణ చేసిన వీర్యం విధానం భారత్ తీసుకొచ్చింది. ఈ వీర్యంతో పాల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, మగ దూడల జనాభాను కూడా పరిమితం చేసే అవకాశం ఉంది. భారత్‌లో తొలిసారిగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద స్థాపించిన కేంద్రాలు.. దేశీయ పశు జాతుల లింగ నిర్ధారణ చేసిన వీర్యాన్ని విజయవంతంగా ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ కేంద్రాలను గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తరాఖండ్, ఉత్తర్ ప్రదేశ్‌లలో ఉన్న ఐదు ప్రభుత్వ వీర్య కేంద్రాలలో ఏర్పాటు చేశారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ' సెక్స్‌డ్ సెమెన్ టెక్నాలజీ ' ప్రస్తుతం అందుబాటులో ఉంది. దీని ద్వారా 90% పైగా ఆడ దూడలు పుట్టే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు పలు రాయితీలు అందిస్తున్నాయి. ఈ పద్ధతి ద్వారా రాష్ట్రంలో 10 శాతం పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ద్వారా ఈ పథకం అమలు చేస్తోంది. 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌లో భాగంగా ఈ సాంకేతికతను భారీగా ప్రోత్సహిస్తోంది. ఈ పథకం కింద రైతులకు 70% వరకు రాయితీ లభిస్తుంది. ప్రైవేట్ మార్కెట్‌లో ఒక డోస్ సుమారు రూ. 500 - రూ. 1,300 ఉండగా.. ప్రభుత్వ రాయితీతో రైతులకు కేవలం రూ. 150 కే అందుబాటులో ఉంది.రైతులు తమ పశువులను 'భారత్ పశుధన్' యాప్‌లో నమోదు చేసుకోవడం ద్వారా ఈ సౌకర్యాన్ని పొందవచ్చు. 2026 నాటికి రాష్ట్రంలోని 10% పాడి పశువులకు ఈ పద్ధతిలో కృత్రిమ గర్భధారణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.తెలంగాణలోనూ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద ఈ సాంకేతికత అందుబాటులో ఉంది. తెలంగాణలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 50%-70% వరకు రాయితీపై సెక్స్‌డ్ సెమెన్ డోసులను అందిస్తున్నారు. కరీంనగర్, కాసంపల్లి వంటి సెమెన్ స్టేషన్లను ఈ సాంకేతికతకు అనుగుణంగా ఆధునీకరించారు. ఈ సెమెన్ వాడటం వల్ల 90% ఆడ దూడలే పుడతాయని పశుసంవర్ధక శాఖ ధ్రువీకరించింది.పాడి రైతులకు ఉపయోగపడే పాడి పశువుల (ఆడ దూడల) సంఖ్య పెరుగుతుంది. అనవసరమైన మగ దూడల పోషణ భారం తగ్గుతుంది. అధిక దిగుబడినిచ్చే మేలుజాతి ఆవు/ గేదె దూడలను త్వరగా పెంపొందించవచ్చు. గతంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవారు. ఒక్కో డోస్ రూ. 1,500 పైనే ఉండేది. ఇప్పుడు మన దేశంలోనే తయారు చేస్తుండటం వల్ల ధరలు భారీగా తగ్గాయి.మీ పశువుకు సెక్స్‌డ్ సెమెన్ వేయాలని అనుకుంటే గ్రామంలోని పశువైద్యుడిని లేదా గోపాలమిత్రను సంప్రదించాలి. దీనికోసం పశువుకు సంబంధించిన ఆధార్ వివరాలు అవసరమవుతాయి.

# చందనోత్సవ ఏర్పాట్లు సిద్ధం



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :**సింహాచలం లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం ఏప్రిల్ 20న జరగనుంది.. ఆలయంలో ఏర్పాట్లపై ముందుగానే ప్రభుత్వం దృష్టిపెట్టింది. విశాఖపట్నం జిల్లా ఇంఛార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చందనోత్సవం ఏర్పాట్లపై ఎమ్మెల్యేలు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి సమీక్ష చేశారు. గత అనుభవాల దృష్ట్యా ఈసారి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు మంత్రి స్వామి. చందనోత్సవంలో సాధారణ భక్తులకు పెద్దపీట వేయాలన్నారు. అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనులు చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 17నాటికి చందనోత్సవం టికెట్ల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని.. వాహన పాసులు, డ్యూటీ పాసుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.చందనోత్సవానికి సంబంధించి దర్శనాల టికెట్ల విషయంలో ఎలాంటి గందరగోళం లేకుండా చూడాలని ఎమ్మెల్యేలు కోరారు. గతేడాది చందనోత్సవానికి సంబంధించి రాత్రి 11 గంటల వరకు భక్తులకు టికెట్లు ఇవ్వలేదన్నారు. ఈసారి మూడు రోజులు ముందుగా జారీ చేయాలని.. టికెట్ల లెక్క పక్కాగా ఉండాలన్నారు. కలెక్టర్, ఈవోల చేతుల మీదుగా టికెట్లు జారీ చేస్తే బావుంటుందని సూచించారు. అలాగే టికెట్లపై క్యూఆర్ కోడ్, స్లాట్ వివరాలు ఉండేలా చూడాలని కోరారు.చందనోత్సవం రోజు దర్శనాల కోసం వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు కలెక్టర్ హరేంధిరప్రసాద్. రూ.300, రూ.1000, రూ.1500 దర్శన టికెట్లు ఉన్న భక్తులకు విడివిడిగా క్యూ లైన్లు ఉంటాయన్నారు. వీరిలో రూ.1500 టికెట్ ఉన్న భక్తులు మాత్రం భోగమండపం నుంచి స్వామిని దర్శించుకోవచ్చన్నారు.

చందనోత్సవం రోజు అప్పన్నకు ముందుగా సుప్రభాత సేవ నిర్వహిస్తారని.. అనంతరం వ్యవస్థాపక ధర్మకర్తలకు తొలి దర్శనం ఉంటుందన్నారు.ఏపీ ప్రభుత్వం, టీటీడీ తరఫున అప్పన్నకు పట్టువస్త్రాలు సమర్పిస్తారని.. వేకువజామున 4.30 గంటల నుంచి వీఐపీ దర్శనాలకు అనుమతిస్తామన్నారు.

అంతరాలయ దర్శనాలు కూడా ఉండవని వివరించారు. చందనోత్సవం కోసం వచ్చే భక్తుల కోసం కొండ దిగువన 50 ఆర్టీసీ బస్సుల్ని అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. చందనోత్సవం కోసం అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటామని విశాఖపట్నం సీపీ శంఖబ్రతబాగ్చీ వివరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. చందనోత్సవానికి వచ్చే చిన్నారులకు ట్యాగ్‌లు అమలు చేస్తామన్నారు.

# ట్రంప్ మూర్ఖత్వానికి ప్రపంచదేశాలు మూల్యం !



ఢిల్లీ,:అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఈ సంవత్సరపు అతిపెద్ద విలన్లుగా ప్రపంచంలో అవతరించారు. తమ యుద్ధ దాహానికి ప్రపంచాన్ని బలి తీసుకున్నారు. ఆయుధ సంపత్తి ఉందికదా అని ఇరాన్‌పై విచ్చలవిగిగా జరిపిన బాంబు దాడిలో ఇప్పటికే ఇరాన్ బాగా దెబ్బతింది. ఇరాన్ దాడుల్లో గల్ఫ్ దేశాలు కూడా దెబ్బిన్నాయి. ఈ క్రమంలో ఏం సాధించారో ట్రంప్ ప్రపంచానికి చెప్పాలి. గతంలో ఇరాక్‌లో ఇలాంటి దడి చేసి సద్దాం హెస్సేన్‌ను ఉరేశారు. ఇక్కడ ఖమేనీని చంపేశారు. వీరి యుద్ధాలు ప్రపంచానికి సంకటంగా మారాయి. ట్రంప్ తీరుతో ప్రపంచం కొరివితో తలగోక్కున్నట్లుగా తయారయ్యింది. ఇరాన్‌ను లొంగదీసుకుంటానని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. క్రమంగా వెనక్కి జారుకున్నారు. చర్చలు జరుగుతు న్నాయని, ఐదు రోజులపాటు యుద్ధానికి విరామం ఇస్తున్నామని ప్రకటించారు. అయితే, ఇరాన్ మాత్రం.. యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఇప్పటి వరకూ.. తమకూ అమెరికాకు మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని, తాము చర్చలకు సిద్ధంగా లేమని స్పష్టం చేసింది. మీరు దాడులు మొదలు పెట్టి మీరే షరతులు పెడతారా అని నిలదీసింది. మేమూ షరతులు పెడతామని చెప్పింది. మొత్తమ్మీద, ట్రంప్ మాటలకు విశ్వసనీయత లేద ని, రోజుకో మాట మాట్లాడటమే ఆయన తీరని మరోసారి రుజువైంది. ఏదేమైనా.. ట్రంప్ వెనక్కి తగ్గటం మాత్రం కాదనలేని వాస్తవం. ట్రంప్ తీరుపై స్వదేశంలోనూ తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇజ్రాయిల్ కోల్పోయిందేమీ లేదు క ఆనీ, అమెరికా భారీగా నష్టాన్ని మూటగట్టుకుంది. ఓ రకంగా చెప్పాలంటే యుద్ధంలో ఇరాన్ గెలిచిందనే చెప్పాలి. ఇరాన్ మీద కయ్యానికి కాలు దువ్వినప్పుడు అమెరికా-ఇజ్రాయెల్ లకు ఓ స్పష్టమైన లక్ష్యం లేదు. ఖమేనీ సారథ్యంలోని ప్రభుత్వాన్ని పడగొడతామని ఒకసారి, ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయకుండా చూడటం అని మరోసారి, ఇరాన్ నుంచి అమెరికాకు ముప్పు పొంచి ఉందని, ఆ దేశాన్ని లొంగదీసుకుంటామని ఇంకోసారి.. ఇలా పూటకో మాట చెప్పారు ట్రంప్. మరోవైపు, తమ మీద రుద్దిన ఈ యుద్ధాన్ని ఎదుర్కొని తమ దేశ సమగ్రతను కాపాడుకునే ఏకైక, స్పష్టమైన లక్ష్యంతో ఇరాన్ యుద్ధంలోకి దిగింది. అంతులేని యుద్ధాలకు ముగింపు పలుకుతానని, అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుస్తానంటూ రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్.. అమెరికాకు ఏ విధంగానూ అవసరం లేని యుద్ధం చేస్తున్నారన్న భావన అమెరికన్లలో వ్యాపించింది. తాము కట్టిన పన్నుల్ని నెతన్యాహూ కోసం ఎందుకు ఖర్చు చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, అమెరికాలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత పెరిగాయి. స్థిరచిత్తం లేని ట్రంప్ మాటలతో, చేతలతో అమెరికా అధ్యక్ష పదవి ఓ జోకులాగా తయారైంది. స్వయంగా ట్రంప్ మద్దతుదారులు కూడా ఈ యుద్ధాన్ని సమర్థించటం లేదు. సర్వేల్లో ట్రంప్ ప్రజాదరణ రోజురోజుకీ దిగజారుతోంది. మరోవైపు, ఈ ఏడాది చివర్లో అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికలు జరగనున్నాయి. అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీకి పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేవన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే, తాజాగా వెనక్కి తగ్గారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెనెజువెలాలో అధ్యక్షుడు మదురో అధికారిక నివాసంపై దాడి చేసి రాత్రికి రాత్రి కిడ్నాప్ చేసి అమెరికాకు తీసుకొచ్చిన ట్రంప్.. ఇరాన్ మీద కూడా అదే ఎ÷-లాన్ అమలు చేయాలని భావించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ రాజధాని టెహ్రాన్‌లో సైనిక, పౌర ఉన్నతాధికారులతో సమావేశమైన తరుణంలో వారి మీద అమెరికా, ఇజ్రాయెల్ అకస్మాత్తుగా బాంబులు కురిపించాయి. వారిని హత్య చేసి యుద్ధం ప్రారంభించాయి. ఖమేనీ హత్య తర్వాత.. అప్పటి వరకూ ఉన్న అంతర్గత విభేదాలు, ప్రభుత్వం మీద ఉన్న అసమ్మతిని కూడా పక్కనపెట్టి.. దేశ పరిరక్షణకు యావత్ ఇరాన్ ఒక్కటైంది. ఆ దేశంలోని ప్రతీ పట్టణంలో.. ఓవైపు క్షిపణులు, బాంబులు పడుతున్నా కూడా బెదరకుండా.. రోడ్ల మీదికి పెద్ద సంఖ్యలో వచ్చి ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తూ ర్యాలీలు జరిపారు. ఇప్పటికీ ఇవి కొనసాగుతున్నాయి. ఇరాన్ బలాబలాలేమిటి అన్నది సమగ్రంగా సమీక్షించకుండానే ట్రంప్ ఈ యుద్ధంలోకి దిగారు. అమెరికా సైన్యాధికారులతో సంప్రదించలేదు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నేతృత్వంలోని శక్తిమంతమైన యూదు లాబీ మాటలువిని ట్రంప్ యుద్ధం నిర్ణయం తీసుకున్నారని స్వయంగా అమెరికా ఉగ్రవాద నిరోధక విభాగం డైరెక్టర్ జో కెంట్ వెల్లడించి నిరసనగా పదవికి రాజీనామా చేశారు. గల్ఫ్ మొత్తానికి యుద్ధాన్ని విస్తరిస్తుందని ట్రంప్, నెతన్యాహు ఊహించి ఉండరు. ఇక హొర్ముజ్ జలసంధిని అడ్డుకోవటం ద్వారా ఇరాన్ తన వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది. దీంతో యుద్ధం ప్రభావం యావత్ ప్రపంచం మీద పడింది. దీనికి ట్రంప్ దూకుడే కారణం. ప్రపంచం యావత్తూ గ్యాస్, ఇంధనాల కొరతతో అల్లుడుతోంది. ఆయా దేవాల ఆర్థిక స్థితి దారుణంగా పడిపోయింది. ఇప్పట్లో ఈ నష్టాల నుంచి కోలుకోవడం ఎవరికైనా కష్టమే.

# అక్షర భిక్షా? అహంకారపు ప్రేలాపనా?



పుస్తకం పట్టిన పసి చేయి రేపటి దేశపు సంతకం. అక్కడ వడ్డించే ముద్ద-అక్షర జ్ఞానానికి ఇంధనం! అది ఎవరో వేసిన 'భిక్ష' కాదు, బిడ్డల ప్రాథమిక 'హక్కు'. కడుపు నిండిన వాడికి.. పేదవాడి ఆకలి ఒక వెక్కిరింత కావొచ్చు! 'పద్మశ్రీ' అన్న గౌరవవమే తలవంచుకునేలా... పసిబిడ్డల ఆకలిని పరిహసించడం భావ్యమా? పురస్కారాల కంటే సంస్కారం గొప్పదని మరిచి పాండిత్యపు గర్వంతో విసిరే పరిహాసపు విసుర్లా ఇవి? 'అన్నం తెచ్చుకుంటే రా..లేదంటే బడి మానేరు!' ఎంతటి అహంకారం? ఎంతటి అజ్ఞానపు పొగరు? గుప్పెడు మెతుకులు లేక పస్తులుండలేక చదువులకై బడి బాట పట్టిన బిడ్డలపై ఇంతటి నిర్దయతో కూడిన అహంకారపు మాటలా? బడిలో పెట్టే గుడ్డుని 'గాడిద గుడ్డు' అని ఈసడించుకోవడం ఎదుగుతున్న రేపటి తరాన్ని నిలువునా అవమానించడమే! పెళ్ళికొడుకులతో పోల్చడం అక్షర జ్ఞానాన్ని, గురుకులాల పవిత్రతను కించపరచడమే! చరిత్రలో మళ్ళీ చీకటి రోజులను కోరుకుంటున్నారా? విద్య కేవలం కొందరి సొత్తు అని గతాన్ని గుర్తు చేస్తున్నారా? జ్ఞాన గర్వంతో.. పేదరికంపై అహంకారం ఎక్కడి సంస్కృతి? రాజ్యాంగం రాసిన హక్కును-రాతలకే పరిమితం చేయకండి. అమ్మ ఒడి నుంచి అక్షరం వరకు అది పేదవాడి ఆత్మాభిమానం! పాండిత్యం అంటే పరుష పదాలు కాదు-పరివర్తన తెచ్చే ఆలోచన! గుర్తుంచుకోండి...కడుపు నిండిన బిడ్డకే 'క' వత్తు స్పష్టంగా పలుకుతుంది ఆదరణ పొందిన విద్యార్థే 'అభివృద్ధి' వైపు నడుస్తాడు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దే మార్గదర్శకులుగా ఉండండి. అంతే కానీ, పసిపిల్లల ఆకలిని ఎగతాళి చేసే రాక్షసత్వం వద్దు! పిల్లల నవ్వుల్లోనే దేశ భవిష్యత్తు ఉంది. దాన్ని అహంకారపు మాటలతో చిదిమేయకండి!

# రాహుల్ గాంధీ వర్సెస్ నరేంద్రమోడీ



న్యూఢిల్లీ, : ఆ రాహుల్ గాంధీ సమయం దొరికితే చాలు నరేంద్ర మోడీ మీద మండిపడుతుంటాడు. రాజకీయానికి.. జాతీయభావానికి తేడా ఏమిటో రాహుల్ గాంధీకి ఇంకా తెలియదు. రాహుల్ గాంధీకి చెప్పేవారు లేరా.. చెబితే వినిపించుకోడా.. ఏంటో కాంగ్రెస్ పార్టీకి దురవస్థ. రాహుల్ గాంధీలో లోపాలే నరేంద్ర మోడీకి వరాలుగా మారుతున్నట్టున్నాయి. అందువల్లే ఏక ఛత్రాధిపత్యంగా నరేంద్ర మోడీ దేశాన్ని పాలిస్తున్నారు .మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో.. భారత్ పై ఏదో ఒక రూపంలో ఆ ప్రభావం పడుతుందని అందరూ అనుకున్నారు. అనుకున్నట్టుగానే చమురు.. గ్యాస్ విషయంలో భారత్ మీద ఆ ఎఫెక్ట్ పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద కన్స్యూమర్ మార్కెట్ గా భారత్ ఉంది. చమురు, గ్యాస్ వంటివి సరఫరా కాకపోతే దేశంలో పరిస్థితి దారుణంగా మారుతుంది. అందువల్లే నరేంద్ర మోడీ ఇక్కడ తన చాకచక్యాన్ని ప్రదర్శించారు. ఎంతో చతురతతో ప్రపంచ దేశాలను ఒప్పించారు. ఇరాన్ గ్యాస్ సరఫరా చేయడానికి ఒప్పుకుంది. అమెరికా కూడా ఎటువంటి ఆంక్షలు లేకుండా భారత్ కు ద్వారాలు తెరిచింది. ఒక నాయకుడు బలంగా ఉంటే.. ఏ దేశమైనా సరే సలాం చేస్తుంది. అందుకు మోడీ నాయకత్వం బలమైన ఉదాహరణ.భారత్ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైన్యాలలో ఒకటిగా ఉంది. భారత్ వద్ద ఉన్న సైనిక బలాన్ని పరిగణలోకి తీసుకుంటే ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద సైన్యం ఉన్న దేశంగా భారత్ ఉంది. ఆసియాలో చైనా, రష్యా తర్వాత సైనిక సామర్థ్యంపరంగా భారత్ మూడో స్థానంలో ఉంది. భారత్ ఎప్పుడూ కూడా ఇతర దేశాల మీద దాడి చేయలేదు. ప్రతి సందర్భంలోనూ స్నేహపూర్వకమైన వాతావరణాన్ని మాత్రమే కోరుకున్నది. అంతటి పాకిస్తాన్ ఉగ్రవాదులతో జతకట్టి.. ఘోరాలకు పాల్పడితే.. భారత్ ప్రతి సందర్భంలోనూ గట్టి బదులిచ్చింది. పాకిస్తాన్ మినహా.. ఏ దేశం మీద కూడా భారత్ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దాడి చేయలేదు.ఇక ఇజ్రాయిల్ దేశంతో భారతదేశానికి బలమైన సంబంధాలు ఉన్నాయి. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఈ సంబంధాలు మరింతగా బలపడ్డాయి. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి భారత నాయకత్వం మీద తన ఆత్మీయతను.. అనుబంధాన్ని బహిరంగంగానే వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీని తనకు ఇష్టమైన స్నేహితుడిగా అభివర్ణించారు. కేవలం ఇజ్రాయిల్ తో మాత్రమే కాకుండా భారత్ ఇరాన్ తో కూడా బలమైన సంబంధాలను కొనసాగిస్తుంది. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ.. భారత్ ఉభయ కుశలోపరి విధానాన్ని కొనసాగించింది. అందువల్లే ఇరాన్ ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండానే మనకు గ్యాస్.. క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తోంది. వాస్తవానికి మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తలు కొనసాగుతున్నప్పటికీ.. రాహుల్ గాంధీ నాయకులు సరెండర్ మోడీ అని విమర్శలు చేసినప్పటికీ.. నరేంద్ర మోడీ తన స్థిరత్వాన్ని కోల్పోలేదు. ఇక్కడ రాజకీయాల కంటే దేశ సామరస్యం.. అభివృద్ధి కోసమే ఆయన కట్టుబడి ఉన్నారు. అందువల్లే ట్రంప్ ఆదేశించినప్పటికీ హర్మూజ్ జల సంధిలో భారత్ నౌకలను మోహరించలేదు. అపరమైన నావికాదళ బలమున్నప్పటికీ ట్రంప్ చెప్పినట్టు నరేంద్ర మోడీ చేయలేదు.. ఒక ప్రాంతీయ సంఘర్షణలో ప్రత్యక్ష పాత్ర పోషించడానికి సుముఖత లేదని నరేంద్ర మోడీ తన విధానాల ద్వారా స్పష్టం చేశారు.కొంతమంది నరేంద్ర మోడీ నాయకత్వాన్ని.. భారత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.. కానీ అలాంటివారు తెలుసుకోవాల్సింది ఏంటంటే.. ప్రపంచంలో అస్థిరత ఉంది. అశాంతి కనిపిస్తోంది. ఇంకా అనేక రకాలైన సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. అయితే అంతటి కల్లోల ప్రపంచంలో భారత్ ప్రశాంతంగా ఉంది. సురక్షితంగా ఉంది. శాంతియుతంగా ఉంది. ఇలా ఉంటుందని ఎవరైనా ఊహించగలరా.. మిడిల్ ఈస్ట్ దేశాల ప్రజల ఫోన్లకు అక్కడి ప్రభుత్వాల నుంచి మిస్సైల్స్ దాడులు.. డ్రోన్ దాడుల గురించి హెచ్చరికలు వస్తున్నాయి. కానీ భారత్ లో ప్రజలు మాత్రం సినిమాలు.. యూట్యూబ్.. ఇన్స్టాగ్రామ్ రీల్స్ చూస్తూ ఆనందంగా ఉంటున్నారు. దీనిని బట్టి మోడీ నాయకత్వ పటిమ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

## రోడ్డు పై ఖాళీ గ్యాస్ సిలిండర్లతో ధర్నా.. నిలిచిపోయిన రాకపోకలు



తాండూరు : వంట గ్యాస్ సిలిండర్ల కోసం వచ్చిన వినియోగదారులు నడి రోడ్డుకు అడ్డంగా ఖాళీ సిలిండర్లు ఉంచి ఆందోళనకు దిగారు. ఖాళీ సిలిండర్లతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఉన్న అంబా భవాని గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్యాస్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులు సిలిండర్ల కోసం భారీగా వచ్చారు. దీంతో ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్ల కొరత ఉందని చెప్పారు. ఇంకా ఎన్ని రోజులు కొరత ఉంటుందని నిర్వాహకులను నిలదీశారు. పక్కన ఉన్న తాండూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఖాళీ సిలిండర్లతో వినియోగదారులు ఫ్లైఓవర్ నడిరోడ్డుపై బైఠాయించి ఆందోళనలకు దిగారు. సుమారు అరగంట పైన సాగిన ఆందోళనతో మహబూబ్ నగర్,పరిగి, కొడంగల్ లకు ప్రధాన రహదారి కావడంతో భారీగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న టౌన్ సిఐ సంతోష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని, వినియోగదారులకు నచ్చజెప్పి, రోడ్డుకు అడ్డంగా ఉంచిన సిలిండర్లను తొలగించి, ట్రాక్ క్లియర్ చేశారు.


# ఎడతెగని భద్రాద్రి పంచాయితీ!

**ఖమ్మం,తెలంగాణ దిశ:** మనదేశంలో.. ముఖ్యంగా దక్షిణాది ప్రాంతంలో ఒక మనిషి పేరుకు ముందు ఇంటి పేరు ఉంటుంది. ఆ తర్వాత కులం.. అనంతరం గోత్రం ఉంటుంది.. ఇది ఇప్పటిది కాదు.. తరతరాలుగా సాగుతూ వస్తోంది. కులాన్ని.. గోత్రాన్ని కొంతమంది వ్యతిరేకించినప్పటికీ.. చాలామంది నేటికీ అనుసరిస్తూనే ఉంటారు..కులాలు.. గోత్రాలు కేవలం మనుషులకు మాత్రమే కాదు.. దేవతామూర్తులకు కూడా ఉంటాయి. దేవతామూర్తులకు కులాలను.. గోత్రాలను ఆపాదించడం ఈనాటిది కాదు.. దాని వెనక ఏళ్ల చరిత్ర ఉంది. ఆయా దేవుళ్లను వివిధ కులాలవారు ఆపాదించుకోవడం పరిపాటిగా మారింది.ఇప్పటివరకు కులాలు.. గోత్రాల విషయంలో ఏ దేవుళ్ళు కూడా ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. వివాదాస్పదమైన సందర్భాలు కూడా లేవు. అయితే తొలిసారిగా ఇటువంటి ఇబ్బందులు శ్రీ సీతారామ చంద్రుడు ఎదుర్కొంటున్నాడు.

వినడానికి ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ ఇది ముమ్మాటికి నిజం. సీతారామ చంద్రుడికి ఆస్థాయిలో ఇబ్బంది ఎందుకు కలిగింది.. గోత్రం విషయంలో స్వామివారు ఎందుకు కోర్టు మెట్లు ఎక్కారు.. ఈ ఆసక్తికరమైన ప్రశ్నలకు సమాధానమే ఈ కథనభద్రాద్రి రామయ్య గోత్రం వశిష్ట. సీతమ్మది గౌతమస గోత్రం. ఈ గోత్రాల పేర్లను చదువుతూ అర్చకులు పూజలు చేస్తూ ఉంటారు. 2012 తర్వాత పండితులు స్వామివారిని అచ్యుత.. అమ్మవారిని సౌభాగ్య గోత్రాలుగా చదువుతున్నారు. ఈ మార్పు వెనుక ఉద్దేశం ఏమిటో తెలియదు. అయితే సీతారామ చంద్రుల గోత్రాలను 2012 నుంచి మార్చి చదువుతున్నారని ఓ భక్తుడు కోర్టు దాకా వెళ్లాడు. 2022లో తెలంగాణ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు ఆదేశాల మేరకు ఒక కమిటీ ఏర్పాటు అయింది. ఆ కమిటీ దేవాదాయ శాఖకు నివేదిక ఇచ్చింది. అయితే ఆ నివేదికను దేవాదాయ శాఖ బయట పెట్టలేదు. దీంతో ఆ వ్యక్తి మళ్ళీ కోర్టును ఆశ్రయించాడు.

దీనిపై హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. ఈ సున్నితమైన వివాదంపై కోర్టు ఎలా విచారిస్తుంది? ఎటువంటి తీర్పు ఇస్తుంది అనేది చూడాల్సి ఉంటుంది.సీతారామచంద్రస్వామికి గురువారం రోజుల్లో కళ్యాణం.. మరో శుక్రవారం పట్టాభిషేకం జరుగుతాయి. ఇంతటి మహత్కార్యాల ముందు స్వామివారు గోత్రానికి సంబంధించి వివాదం ఎదుర్కోవడం.. అది కూడా కోర్టు దాకా వెళ్లడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. స్వామివారి గోత్రాలను మార్చి ఎందుకు చదువుతున్నారు.. గతంలో చదివిన వాటిని ఎందుకు పక్కన పెట్టారు.. అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లభించలేదు.

# ఐటీ సిటీకి గండం..



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా వెలుగొందుతున్న భాగ్యనగర ఐటీ కోటకు బీటలు వారుతున్నాయా? దశాబ్ద కాలంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ఐటీ రంగం.. ఇప్పుడు మొదటిసారిగా తిరోగమనం వైపు అడుగులు వేస్తోందా? కేవలం గణాంకాల తగ్గుదల మాత్రమే కాదు.. ఏఐ విసిరిన సవాలు.. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి హైదరాబాద్ ఐటీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రాజకీయ విమర్శల వెనుక దాగి ఉన్న అసలు చేదు నిజం ఏమిటి? ఇది కేవలం ఒక తాత్కాలిక మందగమనమా లేక పెను సంక్షోభానికి సంకేతమా? అన్నది చర్చనీ యాంశమైంది.హైదరాబాద్ ఐటీ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. గడిచిన దశాబ్ద కాలంగా అప్రతిహత వృద్ధితో దూసుకుపోయిన ఈ రంగంలో మొదటిసారిగా 'రివర్స్ ట్రెండ్' కనిపిస్తుండటం అటు నిరుద్యోగులను, ఇటు ఆర్థిక నిపుణులను కలవరపెడుతోంది. గణాం కాలు చెబుతున్న చేదు నిజం తెలంగాణ మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు రాజకీయ సెగలను మించి ఐటీ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 2023లో 9.46 లక్షలుగా ఉన్న ఐటీ ఉద్యోగుల సంఖ్య, 2026 నాటికి 9.39 లక్షలకు పడిపోయిందని ప్రభుత్వం స్వయంగా గణాంకాల్లో వెల్లడించడం గమనార్హం. అంటే మూడేళ్ల కాలంలో సుమారు 7,000 ఉద్యోగాల తగ్గుదల నమోదైంది. సాధారణంగా ఏటా లక్షల్లో కొత్త ఉద్యోగాలు రావాల్సిన చోట.. ఉన్నవి తగ్గిపోవడం ఐటీ హబ్‌గా హైదరాబాద్ ప్రతిష్టకు సవాలుగా మారింది. ఈ తిరోగమనానికి కేవలం స్థానిక పరిస్థితులే కాకుండా అంతర్జాతీయ పరిణామాలు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తు న్నారు. గతంలో వేలాది మంది అవసరమయ్యే కోడింగ్, టెస్టింగ్ , సపోర్ట్ పనులను ఇప్పుడు ఏఐ సెకన్లలో చేస్తోంది. ఆటోమేషన్ వల్ల కంపెనీలు 'లీన్ మేనేజ్‌మెంట్' తక్కువ మందితో ఎక్కువ పని వైపు మొగ్గు చూపుతున్నాయి. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి: అమెరికా, యూరప్ దేశాల్లో ఆర్థిక మాంద్యం భయాలు, వడ్డీ రేట్ల పెరుగుదల వల్ల ఐటీ ప్రాజెక్టుల బడ్జెట్‌లో కోతలు పడ్డాయి. మన ఐటీ రంగం ప్రధానంగా విదేశీ క్లయింట్లపై ఆధారపడటం వల్ల ఈ ప్రభావం నేరుగా ఇక్కడ కనిపిస్తోంది. పాత పద్ధతుల్లో సాగే సాఫ్ట్‌వేర్ మెయింటెనెన్స్ పనులు తగ్గిపోతున్నాయి. కంపెనీలు కేవలం హై-లెవల్ నైపుణ్యం ఉన్నవారిని మాత్రమే తీసుకుంటున్నాయి, దీనివల్ల కొత్తవారికి అవకాశాలు దెబ్బతింటున్నాయి. ఆర్థిక వ్యవస్థపై పడనున్న 'చైన్ ఎఫెక్ట్' ఐటీ రంగం కేవలం కంప్యూటర్లకే పరిమితం కాదు. ఇది ఒక పెద్ద ఎకోసిస్టమ్. ఐటీ ఉద్యోగుల కొనుగోలు శక్తిపైనే హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్, హోటల్ రంగం, రవాణా, రిటైల్ వ్యాపారాలు ఆధారపడి ఉన్నాయి. ఉద్యోగాల కోత లేదా వేతనాల స్తబ్దత కొనసాగితే గృహ రుణాలు వినియోగ వస్తువుల విక్రయాలు తగ్గి, నగరం యొక్క మొత్తం ఆర్థిక చక్రం మందగించే ప్రమాదం ఉంది. ముందున్న మార్గం: నైపుణ్యమే ఆయుధం రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా ఐటీ రంగం ఇప్పుడు ఒక పరివర్తన దశలో ఉందన్నది కాదనలేని వాస్తవం. భవిష్యత్తులో కేవలం రొటీన్ పనులు చేసేవారికి చోటు ఉండదు. "పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ ఇది ముగింపు కాదు. జెనరేటివ్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కొత్త టెక్నాలజీలలో ఉద్యోగులు త్వరగా నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉంది." అని నిపుణులు సూచిస్తు న్నారు. కాకుండా, కొత్త పెట్టుబడులను ఆకర్షించేలా 'స్కిల్లింగ్ సెంటర్స్' పై దృష్టి పెట్టాలి. ఈ హెచ్చరికను గమనించి అప్రమత్తం కాకపోతే హైదరాబాద్ సాధించిన ఐటీ కీర్తి మసకబారే ప్రమాదం ఉంది.

# ముద్రగడకు నో చెప్పిన జగన్



**కాకినాడ,తెలంగాణ దిశ :** రాజకీయాల్లో ముద్రగడ పద్మనాభానిది ప్రత్యేక స్థానం. 1978లోనే చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి తో పాటు అసెంబ్లీలో అడుగు పెట్టారు. కానీ రాజకీయంగా స్థిరత్వం ఉండదన్న విమర్శ ఆయనపై ఉంది. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి తెలుగుదేశం పార్టీలో చేరారు. అక్కడ టిడిపి నాయకత్వంతో విభేదించి కాంగ్రెస్ లోకి వచ్చారు. కాంగ్రెస్ నుంచి బిజెపి.. అక్కడి నుంచి వైసీపీలో చేరారు. మొన్నటి ఎన్నికలకు ముందు జనసేనలో చేరాలని భావించారు. వీలుకాకపోయేసరికి వైసీపీలో చేరారు. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ముందు కొత్త డిమాండ్ పెట్టినట్లు ప్రచారం నడుస్తోం ది. కానీ జగన్ మాత్రం ఆలోచనలో పడినట్లు సమాచార ముద్రగడ పద్మనాభం తన కుమారుడితో కలిసి ఎన్నికలకు ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కోసం గట్టిగానే పనిచేశారు. ఏకంగా పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు. అలా చేయకపోతే తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని సవాల్ చేశారు. కానీ ఫలితం లేకపోయింది. పేరు మార్చుకోవాల్సి వచ్చింది. అయితే ముద్రగడ పద్మనాభం పెద్దరికాన్ని గౌరవించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పబ్లిక్ అడ్వైజరీ కమిటీలో ఆయనకు స్థానం ఇచ్చారు. అయితే ఈ కమిటీ టిడిపి పోలిట్ బ్యూరో మాదిరిగా కాదు. పెద్దగా అధికారాలు కూడా ఉండవు. అందుకే తనకు పార్టీలో పెద్ద పదవి ఇవ్వాలని ముద్రగడ జగన్మోహన్ రెడ్డిని కోరుతున్నట్లు తెలుస్తోంది. ముద్రగడ పద్మనాభం ఉభయ గోదావరి జిల్లాల బాధ్యతలను తనకు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే ఆయనతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చాలామంది విభేదిస్తున్నట్లు సమాచారం. ఎప్పుడో పాతకాలపు రాజకీయాలు అనుసరిస్తుంటారు ముద్రగడ పద్మనాభం. అందుకే పెద్దగా ఎవరికీ నచ్చరు. ఏ కాపు రిజర్వేషన్ ఉద్యమంతో ముందుకు వెళ్లారు అదే కాపులు ఇప్పుడు ఆయనను నమ్మేస్థితిలో లేరు. మరోవైపు గోదావరి జిల్లాలో జనసేన ప్రభావం అధికంగా ఉంది. ఇటువంటి సమయంలో ముద్రగడ పద్మనాభం కు ఉపయోగ గోదావరి జిల్లాల బాధ్యతలు ఇస్తే ఇబ్బంది కర పరిస్థితులు వస్తాయని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. అందుకే జగన్ ఆ పదవి ఇచ్చేందుకు అంగీకరించరు. మరోవైపు చూస్తే ముద్రగడ తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వయోభారంతో ఇబ్బందులు ఉన్నాయి. అయితే జగన్ ఇప్పుడు పదవి ఇవ్వకపోతే ముద్రగడ నిర్ణయం ఎలా ఉంటుంది అనేది చూడాలి.

# జన్మనిచ్చిన అమ్మే.. పునర్జన్మనూ ఇచ్చింది..!



**మార్కాపురం,తెలంగాణ దిశ :** ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ఓ తల్లి తన ప్రాణాలను పణంగా పెట్టి కొడుకును కాపాడిన ఘటన ప్రతిఒక్కరిని కన్నీళ్లు పెట్టిస్తోంది. మంటలు వ్యాపిస్తున్న క్రమంలో తన కొడుకును బస్సు బయటకు తోసేసి సురక్షితంగా కాపాడిన ఆమె, తాను మాత్రం బస్సులోనే చిక్కుకుని సజీవదహనమైన ఘటన అందరి హృదయాలను ద్రవింపజేస్తోంది. వివరాల్లోకి వెళితే.. కనిగిరి మండలం మందాడివారిపల్లికి చెందిన ఉప్పు రమాదేవి (45) తన కుమారుడు మనోహర్ తో కలిసి బస్సులో స్వగ్రామానికి ప్రయాణిస్తున్నారు. మార్కాపురం సమీపంలో బస్సు ప్రమాదానికి గురై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు బస్సును చుట్టుముట్టాయి. అయితే, అందరికంటే ముందే బస్సులో మంటలను గమనించిన రమాదేవి, ప్రమాదం తీవ్రతను ముందే ఊహించి తన కొడుకు మనోహర్‌ను వెంటనే బస్సు కిటికీ నుంచి బలవంతంగా బయటకు తోసేసింది. దీంతో మనోహర్ సురక్షితంగా బయటపడ్డాడు. కానీ, అప్పటికే మంటలు తీవ్రమవ్వడం, పొగ అలుముకోవడంతో రమాదేవి బయటకు రాలేకపోయింది. బయటపడ్డ కుమారుడు తన తల్లిని కాపాడాలని ఆర్తనాదాలు చేస్తున్నప్పటికీ, మంటల ఉధృతికి ఎవరూ లోపలికి వెళ్లలేకపోయారు. కన్న కొడుకు కళ్లెదుటే రమాదేవి బస్సులో చిక్కుకుని మంటల్లో కాలి బూడిదైంది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు, ప్రయాణికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

# రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

## కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్,తెలంగాణ దిశ :** రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మావల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకంపై రైతు శిక్షణ, ఆస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు బాగుంటేనే రాజ్యం బాగుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 21,000 విత్తన కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఒక్కో కిట్ విలువ సుమారు 500/- ఉంటుందని తెలిపారు. రైతులు కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. భూమి లేని వారు తేనెటీగల పెంపకం వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకు కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు నాబార్డ్, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా 35శాతం నుండి 45శాతం వరకు సబ్సిడీ లభిస్తుందని, ఇందుకోసం రైతులు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ లుగా ఏర్పడాలని పిలుపునిచ్చారు. ఎఫ్.పి.ఓలకు అవసరమైన భూమిని కేటాయించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో యూరియాను వినియోగించాలని, ఆవు పేడ, మూత్రంతో చేసే ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఎస్టీ రైతులకు ప్రత్యేకంగా హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్‌లో 7 నుండి 10 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇప్పిస్తామని వెల్లడించారు. రైతులు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 14416 కి కాల్ చేయాలని సూచించారు. పలువురు రైతులు వినాయక్ చౌక్ లోని రైతుబజార్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరగా, కమిటి ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అంతకుముందు శాస్త్రవేత్తలు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, ప్రకృతి సాగు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రైతులకు ఉచితంగా కూరగాయల విత్తన, ఇతర కిట్లను కలెక్టర్ పంపిణీ చేసి తేనెటీగల పెంపకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, శాస్త్రవేత్త మల్లేష్, ఉద్యానవన అధికారులు అలేఖ్య, క్రాంతి కుమార్, ఏవో అష్రఫ్, రైతు సంఘం నాయకులు గోవర్ధన్ రెడ్డి, రైతులు, గ్రామస్తులు, ఇతర ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కాసులు కురిపిస్తున్న ఎర్ర బంగారం



**గుంటూరు,తెలంగాణ దిశ :**తెలుగు రాష్ట్రాల్లో పండించే మిరప పంటకు ప్రపంచ స్థాయిలోగిరాకీ ఎక్కువే. నాణ్యతతోపాటు మంచి రంగు, రుచి, ఘాటు వీటికి ఉంటుంది. అయితే మిరప రైతులకు గిట్టుబాటు ధర దొరక్క యేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి నష్టాలు చూసేవారు. దీంతో నష్టాల బాధలు భరించలేక చాలా మంది రైతులు మిరపను సాగుచే యలేమంటూ చేతులెత్తేశారు. ఇక మరికొంతమంది రైతులు చేస్తున్న సాగు విస్తీర్ణంను తగ్గించుని కొద్ది మొత్తంలో మాత్రమే మిరప పంటను పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం మిరప పంట రైతులకు కనీవినని రీతిలో కాసులు కురిపించనున్నాయి. అందుకు కారణం మార్కెట్లో మన ఎర్రబంగారానికి ధరలు ఆశాజనకంగా ఉండటమే. ముఖ్యంగా ఏపీలో జనవరి నుంచి మిర్చి ధరల్లో క్రమ క్రమంగా పెరుగుదల కనిపించింది. క్వింటాలుకు సగటున రూ.20 వేల వరకు ధర లభిస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు సగటున క్వింటాలుకు రూ.5 వేలకు పైగానే ధర పెరిగింది. మిర్చికి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు నేరుగా గ్రామాలకు చేరుకుని మధ్యవర్తుల జోక్యం లేకుం డానే రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత నాలుగైదేళ్లుగా నష్టాలను చూసిన మిర్చి రైతులకు తాజా ధరలు ఉపశమనం అందించాయి. మార్కెట్లో మంచి ధర పలకడంతో ప్రస్తుతం శీతల గోదాముల్లో నిల్వ చేసిన సరకు కొద్ది కొద్దిగా తగ్గడం మొదలైంది.ఇక గుంటూరు మార్కెట్ యార్డుకు గత వారంలో 1.29 లక్షల బస్తాల మిరప రాగా.. ఇందులో ఏకంగా 1.26 లక్షల బస్తాల వరకు అమ్ముడయ్యాయి. అయితే మిర్చి సాగు ఈసారి ఒక్క ఆంధ్రప్ర దేశ్‌లో మాత్రమే కాదు.. కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సైతం తగ్గింది.ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగినట్లైంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్?లో డిమాండ్ అధికంగా ఉండటంతో జనవరి నెల నుంచే ధరల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. గతేడాది క్వింటాల్ మిర్చీ కేవలం రూ. 10 వేలలోపు మాత్రమే పలికింది. ఈ సారి రూ.20 వేలకు పైగానే ధర పలుకు తోంది. తేజ మిర్చి ధర జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉంటే ప్రస్తుతం ఏకంగా రూ.19,500కు చేరుకుంది. తాలు రకం కూడా క్వింటాలు ధర రూ.10 వేలకు పైగానే పలుకుతుంది. ఇలా జనవరి నెల నుంచే అన్ని రకాల మిర్చీకి ధరల్లో ఘనీయమైన పెరుగుదల కనిపించింది.పంటలు 50 శాతం తగ్గడం, గోదాముల్లో మిర్చీ నిల్వలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు పోటీపడి మరీ పంటను కొను గోలు చేస్తున్నారు. మార్కెట్?లో ధరలు ఊపందుకోవడంతో రైతులు మిర్చి పంట కోతలు కోసిన వెంటనే త్వరితగతిన ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు. అన్ని ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.4 లక్షల వరకు పంట ఉత్పత్తి వ్యయం అవుతోంది. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే సగటున క్వింటాలుకు రూ.18 వేలు వేసిన పాతిక క్వింటాళ్లకు రూ. 4.50 లక్షల వరకు చేతికొచ్చే అవకాశం ఉంది.

రైతులకు ఆనందం: వరుసగా నష్టాలు రావడంతో ఇక సాగు చేయడం తమ వల్ల కాదంటూ కొందరు మిరప సాగు చేయలేదు. ఇది కాస్త కలిసి వచ్చింది. జనవరి ప్రారంభం వరకు నామమాత్రం ధరలు ఉన్నా.. కొత్త సంవత్సరం నుంచి మిరప ధరలు పైపైకి చేరాయి. ప్రస్తుతం క్వింటాల్ మిరపకు సగటున రూ.20 వేల ధర పలుకుతోంది. జనవరికి నేటికి ధరను పోలిస్తే.. సుమారు 5 వేల రూపాయల వరకు పెరిగింది. ప్రస్తుతం మిరపకు డిమాండ్ బాగా ఉండటంతో.. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి నేరుగా రైతుల వద్ద నుంచి మిరప కొనుగోలు చేస్తున్నారు. తాజా పరిణామంతో గత ఐదేళ్లుగా మిరప సాగుతో నష్టాలు చవి చూసిన రైతులు ఈసారి లాభాలను కళ్ల చూస్తు న్నారు.మిర్చికి ప్రస్తుతం ఎంత డిమాండ్ ఉందంటే.. గత మంగళ వారం గుంటూరు మార్కెట్ యార్డుకు 1.29 లక్షల బస్తాల మిర్చి రాగా, 1.26 లక్షల బస్తాలు అమ్ముడుపోయాయి. దీన్ని బట్టి మిర్చికి డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా మిరప సాగు తగ్గిపోయింది. అటు అంతర్జాతీయ మార్కెట్ లో మిర్చికి మంచి డిమాండ్ ఉండటంతో.. ఈ సంవత్సరం జనవరి నుంచి మిర్చి ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. గతేడాది ఇదే సమయానికి రూ.10 వేలకు అమ్ముడుపోయిన మిర్చికి ఇప్పుడు రూ.20 వేలధర పలుకుతోంది.సన్న రకాలకుడిమాండ్ బాగా పెరిగింది. తాలు ధరలు క్వింటాలుకు రూ.10 వేలకు పైనే ఉన్నాయి. ధరలు ఆశాజన కంగా ఉండటంతో రైతులు మిరప కోసిన వెంటనే ఆరబెట్టి అమ్మేస్తున్నా రు. ఇదిలా ఉంటే ఈ సంవత్సరం మిరప సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. అన్ని ఖర్చులూ కలిపి ఎకరాకు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందంటున్నారు అన్నదాతలు.ఎకరాకు25 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. సగటున క్వింటాలుకు రూ.18 వేల ధర లభిస్తే.. అప్పుడు రూ.4.50 లక్షల వరకు చేతికొస్తోందని తెలిపారు.

## సోషల్ మీడియా రూమర్లు..
# బంకుల వద్ద భారీ క్యూ లైన్లు



**చంపాపేట్,తెలంగాణ దిశ :** పెట్రోల్, డీజిల్ కొరత పై సోషల్ మీడియా వదంతులు వ్యాప్తి చెందడంతో నగరంలో ప్రజలు అయోమయంలో పడుతున్నారు. ప్రభుత్వం, పోలీసులు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ, పరిస్థితి పూర్తిగా అదుపులోకి రావడం లేదు. ఇదే సమయంలో, ఎల్పీజీ, సీఎన్జీ గ్యాస్ సరఫరా పై అనుమానాలు నెలకొనడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో గ్యాస్ బంకుల వద్ద భారీ రద్దీ కనిపిస్తోంది. ముఖ్యంగా మలక్‌పేట్, సంతోష్‌నగర్, చదర్‌ఘాట్ ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు, ఆటోలు క్యూ లైన్లలో నిలిచిపోయాయి. ప్రజలు ముందస్తుగా గ్యాస్ నింపించుకోవాలని పెద్దఎత్తున బంకుల వద్దకు తరలివస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తుండటంతో వారి ఆదాయం పై ప్రభావం పడుతోంది. ఇక, ఇటీవల పెరిగిన డిమాండ్ కారణంగా నగరంలో ఇంధన వినియోగం సుమారు 25 శాతం వరకు పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..: రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరిపడా నిల్వలు ఉన్నాయని సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని, వదంతులను నమ్మి అవసరానికి మించి కొనుగోలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. వదంతులు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తూ కృత్రిమ కొరత పరిస్థితులను తెచ్చిపెడుతున్నాయి. సరైన సమాచారం తెలుసుకుని, అవసరానికి మాత్రమే వినియోగించడం ద్వారా పరిస్థితి నియంత్రణలోకి వస్తుందని అధికారులు సూచిస్తున్నారు.

# అన్నాడీఎంకే వింత హామీలు..



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరానికి అన్నా డీఎంకే అస్త్రశస్త్రాలను సిద్ధం చేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో 297 వాగ్దానాలతో కూడిన భారీ మేనిఫెస్టోను విడుదల చేశారు. సామాన్యులను, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ప్రకటించిన ఈ పథకాలు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. అమ్మ పాలనను గుర్తుచేసేలా ఇంటికో ఫ్రిడ్జ్, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి హామీలతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు.ఈ మేనిఫెస్టోలో అత్యంత ఆకర్షణీయమైన అంశం పురుషులకు ఉచిత బస్సు ప్రయాణం . ప్రస్తుతం అధికార డీఎంకే ప్రభుత్వం కేవలం మహిళలకు మాత్రమే కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని, అన్నా డీఎంకే తాము అధికారంలోకి వస్తే పురుషులకు కూడా వర్తింపజేస్తామని ప్రకటించింది. దీనితో పాటు, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఒక రిఫ్రిజిరేటర్ ఉచితంగా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చింది. గతంలో మిక్సీలు, గ్రైండర్లు ఇచ్చిన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఇప్పుడు ఫ్రిడ్జ్‌ను జాబితాలో చేర్చారు. మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అన్నా డీఎంకే వరాల జల్లు కురిపించింది. కుల విళక్కు పథకం కింద ప్రతి కుటుంబంలోని మహిళా యజమానికి నెలకు రూ. 2,000 నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తామని తెలిపింది. అలాగే, ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని, నిలిపివేసిన తాలికి బంగారం మంగళసూత్రం కోసం బంగారం ,వివాహ ఆర్థిక సాయం పథకాన్ని పునరుద్ధరిస్తామని స్పష్టం చేసింది. ఆడపిల్లల రక్షణ పథకం కింద ఇచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తాన్ని రూ. 50 వేలనుండి రూ. 1లక్షకు పెంచుతున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు , కుటుంబాల సౌభాగ్యం కోసం సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తామని అన్నా డీఎంకే వాగ్దానం చేసింది. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టాస్మాక్ మద్యం దుకాణాలను దశలవారీగా మూసివేస్తామని ఎడప్పాడి పళనిస్వామి భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయం మహిళా లోకం నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందని పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది.యువతను ఆకట్టుకోవడానికి నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు నెలకు రూ. 2,000 చొప్పున భృతి కల్పిస్తామని, ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, వృద్ధాప్య పింఛన్ల పెంపు వంటి అంశాలు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి. అన్నా డీఎంకే ప్రకటించిన ఈ ఉచిత పథకాలు తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. డీఎంకే పథకాలకు ధీటుగా, అంతకు మించిన హామీలను గుప్పించడం ద్వారా పీఠాన్ని దక్కించుకోవాలని అన్నా డీఎంకే గట్టి పట్టుదలతో కనిపిస్తోంది.

# మళ్లీ మొదటికొచ్చిన ఎమ్మెల్యేల ఫిరాయింపుల కథ

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తీర్పు వెలువరించినా.. ఈ వ్యవహారం మళ్లీ హైకోర్టుకుఎక్కింది. స్పీకర్ నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ.. పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా ఆ పిటిషన్లను స్వీకరించిన తెలంగాణ హైకోర్టు..కౌంటర్ దాఖలు చేయాలని.. తాజాగా ఏడుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చింది. ఇక ఇప్పటికే ఇదే వ్యవహారంలో దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు ఇవ్వడం గమనార్హం.తెలం గాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి రావడం లేదు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. తననిర్ణయాన్ని ఇటీవలె వెలువరించారు. 10మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంటూ.. వారిపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లను అన్నింటినీ కొట్టిపారేశారు. అయితే ఈ వ్యవహారం అంతటితో ఆగడం లేదు. స్పీకర్ గడ్డం ప్రసాద్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. మళ్లీ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.ఈ క్రమంలోనే పిటిషనర్లు చేసిన వాదనలను విన్న తెలంగాణ హైకోర్టు.. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తాజాగా నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు కూడా నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే ఇదే వ్యవహారంలో దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తాజాగా కాలే యాదయ్య, అరికె పూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావులపై పిటిషన్‌లు దాఖలు అయ్యాయి.ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని ఈ ఏడుగురు ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇచ్చింది. ఈ పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో పూర్తి అయిపోయింది అనుకున్న తెలంగాణ పార్టీ ఫిరాయింపుల కేసు మళ్లీ మొదటికి వచ్చింది.మరోవైపు.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు ఇటీవలె హైకోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు నోటీసులు ఇచ్చింది. దానం నాగేందర్.. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాంగ్రెస్‌పార్టీలో చేరారని.. ఆతర్వాత కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయినట్లు తెలిపారు. అయినప్పటికీ దానం నాగేందర్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టేశారని.. ఈ నేపథ్యంలోనే స్పీకర్ ఇచ్చిన తీర్పును కొట్టేయాలని తన పిటిషన్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

# మన్సూరాబాద్‌లో 'ఫేక్ గ్యాస్ డీలర్' దందా..?



**వనస్థలిపురం,తెలంగాణ దిశ :**ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ ప్రభావంతో వంట గ్యాస్? కొరత రోజు రోజుకు పెరుగుతోంది. వినియోగదారులు ఏజెన్సీల వద్ద బారులు తీరాల్సి వస్తోంది. ఈ అత్యవసర పరిస్థితులను కొంత మంది అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎల్బీనగర్? పరిధిలోని మన్సూరాబాద్ డివిజన్‌లో గ్యాస్ దందా వెలుగులోకి వచ్చింది. సాయి సప్తగిరి 5వ క్రాస్ రోడ్డులో 'తెలంగాణ గ్యాస్' పేరుతో బోర్డు ఏర్పాటు చేసి, ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను నిల్వ చేసి పంపిణీ చేస్తున్న ఘటన స్థానికులను కలవరపెడుతోంది. ప్రతిరోజూ దాదాపు 2 నుంచి 3 ఆటోల ద్వారా వివిధ కంపెనీలకు చెందిన కమర్షియల్ సిలిండర్లను తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఒకవైపు భారీ ఎత్తున సిలిండర్ల స్టాక్ ఉంచి, మరోవైపు సరఫరా కొనసాగించడం వల్ల ఇది పూర్తిగా అనధికార కార్యకలాపమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా 'తెలంగాణ గ్యాస్' పేరుతో ఉన్న ఈ కేంద్రం ఏ గ్యాస్ కంపెనీకి సంబంధించిన అధికారిక డీలర్ కాదని స్థానికులు చెబుతున్నారు.

విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యం..:ఈ వ్యవహారం పై రంగారెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన సరిగా లేకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా 'వెంటనే విజిలెన్స్ అధికారులను పంపిస్తాను' అని హామీ ఇచ్చినప్పటికీ, విజిలెన్స్ అధికారిని సంప్రదిస్తే 'ప్రస్తుతం నాకు సమయం లేదు.. తర్వాత వస్తాను' అని చెప్పడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ పరిణామాలు అధికారుల నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా పౌరుల ఫిర్యాదులను పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్రమ గ్యాస్ నిల్వలు ప్రమాదకరమని, వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## విజయవాడలో కోర్టుకు హాజరైన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

**విజయవాడ,తెలంగాణ దిశ :**గోరంట్ల మాధవ్ విజయవాడ కోర్టుకు హాజరయ్యారు. తనపై నమోదైన కేసు సంబంధంగా న్యాయస్థానంలో విచారణకు హాజరైన ఆయన, కోర్టు ఆదేశాల మేరకు హాజరు నమోదు చేసుకున్నారు.కోర్టు ప్రాంగణానికి వచ్చిన గోరంట్ల మాధవ్‌కు పోలీసులు భద్రత కల్పించారు. కేసుకు సంబంధించిన తదుపరి విచారణను కోర్టు మరో తేదీకి వాయిదా వేసినట్లు సమాచారం.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన గోరంట్ల మాధవ్, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. నిజం వెలుగులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.


## వినియోగదారులకు షాక్
# పెట్రో, డీజిల్ ధరలు పెంచి నయారా




న్యూఢిల్లీ(ఆర్ఎన్ఎ): ప్రైవేటురంగ చమురు సంస్థ నయారా ఎనర్జీ వినియోగదారులకు షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేసింది. లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచింది. పెరిగిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఆయా రాష్ట్రాలు విధించే వ్యాట్ ఆధారంగా ఈ పెంపు వర్తిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లోఈ పెంపు గరిష్ఠంగా రూ.5.30 వరకు ఉంటుంది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా పెట్రోల్ పంపులు ఉండగా.. రష్యా చమురు సంస్థ అయిన రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీ 6,967 పెట్రోల్ పంపులను ఆపరేట్ చేస్తోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను సవరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరో ప్రముఖ ప్రైవేటురంగ చమురు సంస్థ రిలయన్స్-బీపీ మాత్రం పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. దేశవ్యాప్తంగా 2,185 ఔట్‌లెట్లను జియో-బీపీ నిర్వహిస్తోంది. సుమారు 90 శాతం మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వరంగ చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ మాత్రం సాధారణ పెట్రోల్, డీజల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. ప్రీమియం పెట్రోల్ ధరను మాత్రం రూ.2.30 మేరకు ఇటీవల సవరించాయి. ఇండస్ట్రియల్ డీజిల్‌ను లీటరుకు రూ.22 చొప్పున పెంచాయి.

## మే 4న ఏపీ లాసెట్ పరీక్ష

**అమరావతి,తెలంగాణ దిశ :**రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో న్యాయవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ నిర్వహిస్తున్న ఏపీ లాసెట్-26 ప్రవేశ పరీక్ష మే 4న జరుగుతుందని లాసెట్ కన్వీనర్, మహిళా వర్సిటీ న్యాయ విభాగం ఆచార్యులు సీతాకుమారి బుధవారం తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు అపరాధ రుసుముతో వచ్చే నెల 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పరీక్ష ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో జరుగుతుందన్నారు. 3 సంవత్సరాల ఎల్ఎల్.బి అభ్యర్థులకు ఉదయం 9 నుంచి 10.30 వరకు, 5 సంవత్సరాల ఎల్.ఎల్.బి, రెండు సంవత్సరాల ఎల్ఎల్ఎం కోర్సు అభ్యర్థులకు మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.




# 'బడ్డీమూన్' ట్రెండ్ సెట్ చేసిన విరోష్ జంట!





టాలీవుడ్‌లో మోస్ట్ క్యూట్ కపుల్‌గా పేరొందిన విజయ్ దేవరకొండ, రష్మిక మంధాన ఇటీవల వివాహ బంధంలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో అత్యంత సన్నిహితుల మధ్య హిందూ మరియు కొడవ సంప్రదాయాల ప్రకారం వీరి పెళ్లి ఘనంగా జరిగింది. అనంతరం విజయ్ స్వగ్రామంలో సత్యనారాయణ వ్రతం నిర్వహించగా, హైదరాబాద్‌లో రిసెప్షన్‌ను ఘనంగా నిర్వహించారు. పెళ్లి వేడుకలతో బిజీగా గడిపిన ఈ జంట ప్రస్తుతం హనీమూన్ కోసం థాయ్‌లాండ్‌కు వెళ్లి రిలాక్స్ అవుతున్నారు. అక్కడి నుంచి షేర్ చేస్తున్న క్యూట్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే, ఈ జంట ప్రత్యేకంగా నిలిచింది వారి హనీమూన్ స్టైల్ వల్లే. సాధారణంగా హనీమూన్ అంటే కొత్త దంపతులు ఇద్దరే వెళ్లి ఏకాంతంగా గడుపుతారు. కానీ విజయ్-రష్మిక జంట మాత్రం ఈ ట్రెండ్‌ను మార్చేశారు.ప్రముఖ ఫ్యాషన్ మ్యాగజైన్ వోగ్ వెల్లడించిన వివరాల ప్రకారం, వీరు హనీమూన్‌ను 'బడ్డీమూన్'గా మార్చుకున్నారు. థాయ్‌లాండ్‌లోని 'కో సముయ్'కి ఈ జంట తమ ప్రాణస్నేహితులతో కలిసి ప్రత్యేక ట్రిప్‌ను ప్లాన్ చేసుకున్నారు. ఎయిర్‌బీఎన్బీ ద్వారా ఏర్పాటు చేసిన ప్రైవేట్ గెటవేలో వీరంతా కలిసి ఎంజాయ్ చేసిన ఫోటోలు ప్రస్తుతం నెట్‌లో ట్రెండ్ అవుతున్నాయి. అయితే హనీమూన్‌కు వెళ్లే సమయంలో కొత్త దంపతులు తమ సన్నిహిత స్నేహితులను కూడా వెంట తీసుకెళ్లడాన్ని 'బడ్డీమూన్' అంటారు. 'బడ్డీ' అంటే ఫ్రెండ్ అనే అర్థం రావడంతో ఈ పేరు వచ్చింది. పెళ్లి హడావుడిలో స్నేహితులతో గడపలేకపోయిన వారు, లేదా గ్రూప్‌గా సెలబ్రేట్ చేయాలని భావించే జంటలు ఈ ట్రెండ్‌ను ఎంచుకుంటున్నారు. ఇప్పుడు విజయ్-రష్మిక జంట ఈ 'బడ్డీమూన్' ద్వారా మరోసారి ట్రెండ్ సెట్ చేయడంతో, నెటిజన్లు వీరిని ప్రశంసిస్తున్నారు. ప్రేమతో పాటు స్నేహాన్నీ సమానంగా సెలబ్రేట్ చేస్తున్న ఈ జంట స్టైల్ నిజంగా ప్రత్యేకమని కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇక విజయ్ రష్మికలు త్వరలో రణబాలి అనే చిత్రంతో ప్రేక్షకులని పలకరించబోతున్నారు. బడ్డీమూన్ తర్వాత ఈ జంట షూటింగ్‌తో బిజీ కానున్నారు.

# విడాకుల రూమర్లపై గట్టి కౌంటర్ ఇచ్చిన ప్రియాంక చోప్రా..



గ్లోబల్‌స్టార్ ప్రియాంక చోప్రా తన వ్యక్తిగత జీవితం, వివాహ బంధం పై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. ముఖ్యంగా భర్త నిక్ జోనాస్‌తో విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆమె పూర్తిగా కొట్టిపారేశారు. ఈ రూమర్లు నిరాధారమైనవని,తమ మధ్య ఉన్న ప్రేమ, నమ్మకం మరింత బలంగా ఉందని స్పష్టం చేశారు. దేశం, మతం, వయసు వంటి భేదాల కారణంగానే కొందరు తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారని అన్నారు. "మేము ఎనిమిదేళ్లుగా ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్నాం. కేవలం ఆరు నెలల పరిచయంతోనే పెళ్లి చేసుకున్నప్పటికీ, నిక్‌లో ఉన్న నిజాయతీ, పరస్పర గౌరవం మా బంధాన్ని మరింత బలపరిచాయి అని ఆమె తెలిపారు. ఇతరుల అభిప్రాయాలు తమ నిర్ణయాలను ప్రభావితం చేయవని ఆమె తేల్చి చెప్పారు. ఇక కుటుంబ విషయానికి వస్తే, తన కుమార్తె మాల్తీ మేరీ ప్రైవసీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు ప్రియాంక వెల్లడించారు. సెలబ్రిటీగా బయటకు వెళ్లినప్పుడు అనుమతి లేకుండా ఫోటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడం తనకు ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. "నాతో మాట్లాడేవారిని గౌరవిస్తాను, కానీ ప్రైవసీకి భంగం కలిగించడం అంగీకరించను. అందుకే నా కుమార్తె భద్రత కోసం సెక్యూరిటీ ఏర్పాటు చేసుకున్నాను" అని వివరించారు. వృత్తిపరంగా కూడా ప్రియాంక తన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. బాలీవుడ్‌లో అగ్ర నటిగా ఎదిగిన తర్వాత, 30 ఏళ్ల వయసులో అన్నిటిని వదిలి హాలీవుడ్‌లో అడుగుపెట్టడం తన జీవితంలోపెద్దసాహసంఅని చెప్పారు. ప్రారంభంలో మూస పాత్రలు వచ్చినప్పటికీ, పట్టుదలతో ముందుకు సాగి ఇప్పుడు తనకు నచ్చిన పాత్రలను ఎంచుకునే స్థాయికి చేరుకున్నానని ఆమె తెలిపారు. నిజమైన విజయం అంటే మనకు ఇష్టమైన పని చేస్తూ కుటుంబంతో సమయం గడపడం అని ప్రియాంక అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా స్థిరంగా ఉన్నప్పటికీ కొత్త సవాళ్లను స్వీకరించడమే తనను ఈ స్థాయికి తీసుకువచ్చిందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రియాంక చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, ఆమె అభిమానుల నుంచి విస్తృత మద్దతు పొందుతున్నాయి.

# చరణ్‌కు గాయం.. చిరంజీవి పోస్ట్‌తో ఊపిరి పీల్చుకున్న అభిమానులు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ షూటింగ్‌లో గాయపడ్డాడన్న వార్త అభిమానులను ఎంతగా కలవరపరిచిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'పెద్ది' సినిమా చిత్రీకరణ సమయంలో ఆయన కంటికి గాయం కావడం చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్‌లో జరుగుతున్న షూటింగ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవి స్వయంగా స్పందిస్తూ సోషల్ మీడియా ద్వారా హెల్త్ అప్‌డేట్ ఇచ్చారు. "ఈ క్లిష్ట సమయంలో చరణ్ కనురెప్పకు అత్యంత నైపుణ్యంతో చికిత్స అందించిన వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు. మొదట కొంత ఆందోళన ఉన్నప్పటికీ, వైద్యుల భరోసా మాకు ధైర్యం ఇచ్చింది. ప్రస్తుతం అంతా సవ్యంగానే ఉంది" అని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి చేసిన ఈ ప్రకటనతో మెగా అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు. సోషల్ మీడియాలో చరణ్ త్వరగా కోలుకోవాలని కోరుతూ ఫ్యాన్స్ పెద్ద ఎత్తున పోస్టులు చేస్తున్నారు. ఇక 'పెద్ది' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రాన్ని దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అలాగే శివరాజ్ కుమార్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గాయం కారణంగా రామ్ చరణ్ కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోనున్నప్పటికీ, షూటింగ్ షెడ్యూల్‌లో పెద్ద మార్పులు లేకుండా ముందుకు తీసుకెళ్లాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఏప్రిల్ 30న సినిమా విడుదల చేయాలనే లక్ష్యంతో మేకర్స్ వేగంగా పనులు కొనసాగిస్తున్నారు.

# సినిమా

# ట్రోలింగ్‌పై గట్టిగా స్పందించిన హరీష్ శంకర్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ రిలీజ్‌కు ముందు,ఆ తర్వాత కూడా దూకుడుగా ప్రమోట్ చేసిన విషయం తెలిసిందే. హీరో ప్రమోషన్స్‌లో పెద్దగా కనిపించకపోయినా, సినిమా ప్రచార బాధ్యతను పూర్తిగా తన భుజాలపై వేసుకుని ముందుండి నడిపించారు హరీష్ శంకర్. అయితే సినిమా బాక్సాఫీస్ ఫలితాలపై సోషల్ మీడియాలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ముఖ్యంగా హరీష్ శంకర్‌పై ట్రోలింగ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన తాజాగా స్పందిస్తూ ట్రోల్స్‌పై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. పోస్ట్ రిలీజ్ ప్రమోషన్స్‌లో భాగంగా హీరోయిన్లు శ్రీలీల, రాశీ ఖన్నాతో కలిసి నిర్వహించిన చిట్‌చాట్‌లో హరీష్ మాట్లాడుతూ... "ఈ రోజుల్లో సోషల్ మీడియాలో ఎవరికైనా ట్రోల్ చేయడం చాలా సులభం. కానీ నేను వాటిని సీరియస్‌గా తీసుకోను. ఎందుకంటే ట్రోలర్స్‌కి ఐడెంటిటీ ఉండదు. నేను మాట్లాడే ప్రతి మాటకు బాధ్యత వహిస్తాను. కానీ వాళ్లకి ఆ బాధ్యత ఉండదు" అనిఅన్నారు. అసభ్యకరంగా దూషించినప్పుడు మాత్రం తాను స్పందిస్తానని ఆయన స్పష్టం చేశారు. హద్దులు దాటితే బ్లాక్ చేస్తాను లేదాఅవసరమైతే కంప్లయింట్ ఇస్తాను. లేదంటే ఎక్కువగా పట్టించుకోను అని తెలిపారు. డైరెక్టర్ అవ్వాలనుకున్న సమయంలో తన తల్లిదండ్రులేవిమర్శించారని, అందుకే ట్రోల్స్ తనకు కొత్తేమీ కాదని చెప్పారు. సినిమా నిర్మాణ సమయంలో ఎదురైన సవాళ్లను గుర్తు చేసుకుంటూ... ఇంత పెద్ద సినిమా తీసేటప్పుడు చివరి నిమిషంలో మ్యూజిక్ డైరెక్టర్ మారడం, రిలీజ్ డేట్ ముందుకు రావడం వంటి ఒత్తిడులుఎదురయ్యాయి. అయినా కూడా సినిమా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం నాకు పెద్ద సక్సెస్" అని పేర్కొన్నారు. సినిమా అవుట్‌పుట్ విషయంలో నేను పూర్తిగా సంతృప్తిగా ఉన్నాను. ప్రేక్షకులు సినిమా చూసి ప్రశంసిస్తున్నారు. నా శక్తికి మించి పని చేశాను అని హరీష్ శంకర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, ట్రోలింగ్‌పై ఇచ్చిన కౌంటర్ చర్చకు దారితీస్తోంది.

## సీనియర్ హీరోలకి జంటగాపెళ్లైన హీరోయిన్స్..

# అనీల్ రావిపూడి ప్లానింగ్స్ అదుర్స్




టాలీవుడ్‌లో సంక్రాంతి సీజన్ అంటే వెంటనే గుర్తుకు వచ్చే దర్శకుడు అనీల్ రావిపూడి. కామెడీ, ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్‌కు ప్రత్యేకమైన స్టైల్‌ను తీసుకొచ్చిన ఆయన, వరుస విజయాలతో ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఇటీవల విడుదలైన 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఆయన, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.ఈసారి ఆయన ఒక భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో వెంకటేష్, కళ్యాణ్ రామ్ కలిసి నటించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

పస్తుతం అనిల్ రావిపూడి తన టీమ్‌తో కలిసి స్క్రిప్ట్ పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. ఆయన గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమాలో కూడా కడుపుబ్బ నవ్వించే కామెడీతో పాటు బలమైన కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఎలివెంట్స్‌ను సమతుల్యంగా మేళవించేందుకు ప్లాన్ చేస్తున్నారు. వెంకటేష్‌కు సూట్ అయ్యే ఫ్యామిలీ కామెడీ ట్రాక్, కళ్యాణ్ రామ్‌కు సరిపోయే యాక్షన్ షేడ్స్ ..ఈ రెండింటి మేళవింపుతో కథను డిజైన్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన హీరోయిన్ల ఎంపికపై కూడా ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. వెంకటేష్ సరసన కీర్తి సురేష్ దాదాపు ఖరారైనట్లు టాక్ వినిపిస్తోంది. 'మహానటి' ఫేమ్ కీర్తి సురేష్, పెళ్లి తర్వాత కూడా వరుస సినిమాలతో బిజీగా ఉండడం తెలిసిందే. మరోవైపు, కళ్యాణ్ రామ్ సరసన 'ఉప్పెన' ఫేమ్ కృతి శెట్టి ను తీసుకోవాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఇది నిజమైతే, ఇటీవల ఫ్లాపులతో ఇబ్బంది పడుతున్న కృతి శెట్టికి ఇది మంచి అవకాశంగా మారనుంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. సంక్రాంతి సీజన్‌ను టార్గెట్ చేస్తూ చిత్రాన్ని విడుదల చేయాలన్న ప్లాన్‌లో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అనిల్ రావిపూడి గత ట్రాక్ రికార్డ్‌ను దృష్టిలో ఉంచుకుంటే, ఈ ప్రాజెక్ట్ కూడా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంటుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. వెంకటేష్ కామెడీ టైమింగ్, కళ్యాణ్ రామ్ యాక్షన్ స్టైల్, అనిల్ రావిపూడి టేకింగ్ ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇవ్వనుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. అధికారికంగా పూర్తి క్యాస్ట్, టైటిల్, రిలీజ్ డేట్ ప్రకటించే వరకు ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగే అవకాశముంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215